www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 16   సంచిక : 125   శనివారం, సెప్టెంబర్ 19, 2026 , పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# సిద్ధిపేటలో ఆక్రమించుకున్న భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మిస్తాం

- నూనూగు మీసాల కెటిఆర్ కొడుకుకి 40 ఎకరాల భూమి ఎలా వచ్చింది.
- అసైన్డ్ భూముల పట్టాదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టం
- కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సర్వే అనంతరం వాస్తవాలు వెల్లడిస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్:సెప్టెంబర్ 18 :** రాష్ట్రంలో భూములపై నెలకొన్న వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలంటే రికార్డులు, భౌతిక పరిస్థితి రెండింటినీ సమన్వయం చేయాల్సి ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రికార్డులో ఉన్న భూమి ఎంత? డాక్యుమెంట్లలో ఎంత? భౌతికంగా ఎవరి పొజిషన్‌లో ఎంత ఉంది? ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? అన్నది సమగ్ర సర్వే ద్వారా తేలుస్తాం. వాస్తవాలు బయటకు వచ్చిన తర్వాత చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా

మిగతా2లో...

## ప్రైవేట్ వర్సిటీలను లాభార్జన కోసం నిర్వహించకూడదు

**- ఆడిట్ ఖాతాలను సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశం**



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 18 :** ప్రైవేట్ యూనివర్సిటీలను లాభం కోసం నిర్వహించ కూడదని సుప్రీం కోర్టు గురువారం తెలిపింది. ప్రజల విద్యా లక్ష్యాలను పూర్తి చేసే ఉద్దేశం వాటికి ఉండాలని పేర్కొంది. కేవలం లాభాలు సంపాదించుకొనే వ్యాపారం లా విద్యను చూసే సంస్థలను అనుమతించొద్దని ప్రభుత్వాలను కోరింది. అన్ని విశ్వవిద్యాలయాల ఆడిట్ చేసిన ఖాతాలను ఆరు వారాల్లోగా తమకు సమర్పిం చాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ను ఆదేశించింది. ఆ ఖాతాల్లో మిగులు ఆదా యం, వ్యయం, వసూలు చేసిన రుసుముల వివరాలు ఉండాలని స్పష్టం చేసింది. అమిటీ యూనివర్సిటీ కాలేజీ రికార్డుల్లో తన పేరు మార్చుకోవాలని ప్రయత్నించిన ఓ విద్యార్థిని తనను యాజమాన్యం వేధించిందని దాఖలు చేసిన కేసులో కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## వాళ్లలాగా నేను కబ్జాలు పెట్టలేదు: హరీష్ రావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 18 :** అన్ని ఎన్నికల అఫిడవిట్లలో తన భూములు, ఆస్తుల వివరాలు సుస్పష్టంగా చెప్పానని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు తెలిపారు. సర్వే నెంబర్లతో సహా భూముల వివరాలు ఇచ్చానని, కాంగ్రెస్ వాళ్లు సిద్దిపేటకు వస్తున్నారని, తన భూములు చూసి పోతారని, వందల మంది పోలీసులు, బుల్లెట్ ప్రూఫ్ బండ్లు. రోప్ పార్టీలు ఎందుకు, డ్రోన్లు పెట్టీ ఫోటోలు తీయడం ఎందుకు అని ప్రశ్నించారు. సిద్ధిపేటలో బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. తాను ఇక్కడే ఉన్న తనకు చెబితే అన్ని ఏర్పాటు చేస్తానని, మంచిగా కడుపు నింద అన్నం తినిపించి దగ్గరుండి కంటి నిండా తోట అన్నీ చూపిస్తానన్నారు. కాకుంటే ఉన్నది ఉన్నట్లు చెప్పండని, అబద్ధాలు చెప్పకండని తన జీవితం తెరిచిన పుస్తకం అని తెలియజేశారు. రామంచలలో 13 ఎకరాలు ఉంటే లేని పోనీవి చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను దాచింది ఏముంది కాంగ్రెసోళ్లు కొత్తగా బయట పెట్టేది ఏముందని అడిగారు. కాంగ్రెస్ నాయకులు లాగా తాను కబ్జాలు పెట్టలేదని, ప్రజల

మిగతా2లో...

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా..



**హైదరాబాద్,సెప్టెంబర్ 18 :** ఎనిమిది రోజుల పాటు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 51 గంటల 52 నిమిషాల పాటు కొనసాగిన సభలో ప్రశ్నలు, చర్చలు, సభ్యుల ప్రసంగాలు,

మిగతా2లో...



## సమన్వయంతో పని చేయాలి

**ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణపై సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 18 :**ఈ ఏడాది డిసెంబర్ 11 నుంచి 22 వరకు హైదరాబాద్ సహా హన్మకొండ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం వేదికగా జరుగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను (అండర్-18) సమన్వయంతో

మిగతా2లో...

## రైతులు, మిల్లర్ల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 18 :** తెలంగాణలో రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలకంగా ముందడుగు వేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మిల్లర్ల ప్రతినిధులతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సానుకూల వాతావరణంలో జరిగిన చర్చల్లో మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా చూస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల ప్రయోజనాలు.. ప్రజాధనం పరిరక్షణతో పాటు మిల్లింగ్ రంగం స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. మిల్లర్లపై అనవసర భారం మోపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. మిల్లర్లు సమర్పించిన వినతులను సానుకూలంగా

మిగతా2లో...

## 'ప్రజాస్వామ్యం' కన్నీరు తుడిచిన హైకోర్టు!..

- ప్రజా ప్రాతినిధ్య చట్టంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు
- స్పీకర్ ట్రిబ్యునల్ నిర్ణయానికి భిన్నంగా హైకోర్టు తీర్పు
- ఎమ్మెల్యేల పార్టీ మార్పులపై కీలక సంకేతాలు
- తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో మార్పులకు అవకాశం




**హైదరాబాద్, 18 :** పార్టీ ఫిరాయింపుల అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థలో ఓటర్ల తీర్పుకు ఉన్న ప్రాధాన్యత, రాజ్యాంగ విలువల పరిరక్షణపై ఈ తీర్పు మరోసారి దృష్టిని కేంద్రీకరించింది. పార్టీ గుర్తుపై గెలిచి అనంతరం మరో పార్టీలోకి వెళ్లే ఎమ్మెల్యేల విషయంలో న్యాయస్థానాల జోక్యం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. **ఫిరాయింపుల రాజకీయానికి హెచ్చరిక సంకేతం** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ మార్పులు కొత్త విషయం

మిగతా2లో...

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల




**హైదరాబాద్,సెప్టెంబర్ 18 :** తెలంగాణ ఆర్టీసీలో కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఎన్నికలు నిర్వహించి, 17న ఫలితాలు వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు. 2016 జులై 19న ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా.. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి. **ఎన్నికల పూర్తి షెడ్యూల్ వివరాలు** సెప్టెంబర్ 21 (సోమవారం): పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న యూనియన్లు సమ్మతి పత్రాలను సమర్పించడం. సెప్టెంబర్ 22 (మంగళవారం): ఆయా డిపో మేనేజర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సంబంధిత జిల్లాల డిప్యూటీ రిటర్నింగ్ అధికారులకు అందజేయడం, యూనియన్ల నుంచి అభ్యంతరాలు కోరడం. సెప్టెంబర్ 24 (గురువారం): ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు ఆఖరి తేదీ. సెప్టెంబర్ 25 (శుక్రవారం): సంబంధిత డిపో మేనేజర్లు/యూనిట్ అధికారులతో చర్చించి అభ్యంతరాలను పరిష్కరించి తుది రూపు ఇవ్వడం. సెప్టెంబర్ 26 (శనివారం): పోటీ చేసే

మిగతా2లో...



## ఈ నెల 28 నుంచి బంగారు ఉంగరం పథకం

**తమిళనాడు, సెప్టెంబర్ 18( :** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సెప్టెంబర్ 28న నవజాత శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించే పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. తొలి విడత పంపిణీ కోసం 1.28 లక్షల బంగారు ఉంగరాలను ప్రభుత్వం

మిగతా2లో...

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక




## ప్రపంచం చూపు హైదరాబాద్ వైపు

**- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్ 18 :** ప్రపంచం హైదరాబాద్ వైపుచూస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఈమేరకు ఎక్స్ వేదికలో సీఎం పేర్కొన్నారు. కేవలం పెట్టుబడులు, వ్యాపారం కోసమే కాదు... ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞానం, నైపుణ్యాలు, ప్రతిభ, ఆవిష్కరణలు, ఆలోచనల కోసమని అభిప్రాయపడ్డారు. గురువారం ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో ఎగ్జిక్యూటివ్ విద్య, పరిశోధన, ప్రపంచ నైపుణ్యాలు, పరిశ్రమలు, విద్యాసంస్థల సహకారం వంటి రంగాలలో భాగస్వామ్యాలను మరింత పటిష్టం చేసుకునేందుకు, తాను యూకేలోని ప్రముఖ బిజినెస్ స్కూల్స్, విశ్వవిద్యాలయాల ప్రతినిధి బృందంతో సమావేశమైన విషయాన్ని ప్రస్తావించారు. డిసెంబర్ నుంచి హార్వర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు కొనసాగుతా యని తెలిపారు. అదే సమయంలో ఎంఐటీ, పర్ద్యూ, యూనివర్సిటీ ఆఫ్ లండన్, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలతో కూడా సహకారాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భారత్‌ఫ్యూచర్‌సిటీ ఈ దార్శనికతను మరింత ముందుకు తీసుకువెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తుకు అవసరమైన ప్రపంచ స్థాయి విద్యా కేంద్రం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రపంచ స్థాయి కంపెనీలు, అత్యాధునిక పరిశోధన ఒకచోట అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచమే నేర్చుకునేలా, ఆవిష్కరణలు చేసేలా, పెట్టుబడులు పెట్టేందుకు అనువైన ప్రదేశంగా మార్చుతామని పేర్కొన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు...2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆదాయాన్ని సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.

# సిద్ధిపేటలో ఆక్రమించుకున్న భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి , తాను మాట్లాడే ప్రతి అంశానికి డాక్యుమెంట్లు, అధికారిక రికార్డులు ఉన్నాయని, సర్వే పూర్తయిన తర్వాత సాంకేతిక ఆధారాలతో వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు. భూముల విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టదని, అయితే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, ప్రైవేట్ పట్టా భూములు, భౌతిక స్వాధీనం, రెవెన్యూ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లలో చూపిన ఆస్తుల మధ్య తేడాలు ఉంటే వాటిని రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సిందేనని అన్నారుకేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సమగ్ర సర్వే కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఉన్న భూముల విషయంలో స్థానికుల నుంచి వచ్చిన సమాచారాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన కూడా స్థానికుల నుంచి వచ్చిన సమాచారంపై ఆధారపడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల్లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు సర్వేలో తేలితే, చట్టప్రకారం ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అర్హులైన పేదలకు, ముఖ్యంగా దళితులకు ఉపయోగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. 2004 అఫిడవిట్‌లో భూములు లేవని చెప్పి.. ఇప్పుడు వందల ఎకరాలు ఎలా? అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ భూములపై జరుగుతున్న చర్చలో ఎన్నికల అఫిడవిట్లలో నమోదైన వివరాలు కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. 2004 లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో కెసిఆర్ తన పేరున వ్యవసాయ భూమి లేదని పేర్కొన్నారు. అలాంటప్పుడు తర్వాత కాలంలో విస్తారమైన భూములు ఎలా వచ్చాయి? పుట్టుకతోనే వందల ఎకరాల భూస్వాములమని చెబుతున్నప్పుడు, ఆ భూముల వివరాలు సంబంధిత ఎన్నికల అఫిడవిట్లలో ఎందుకు కనిపించలేదు? అని మంత్రి ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రస్తుత వాదనలు, అప్పటి అఫిడవిట్ల వివరాల మధ్య ఉన్న తేడాలను రికార్డుల ఆధారంగా పరిశీలించాల్సి ఉందన్నారు. కెటిఆర్ కొడుకు పేరిట 40 ఎకరాల భూమిపై స్పందిస్తూ నూనూగు మీసాల పిల్లోడు ఏ వ్యాపారం చేశాడని ఇంత భూమి వచ్చిందని మంత్రి ప్రశ్నించారు. హరీశ్‌రావు అఫిడవిట్‌పైనా ప్రశ్నలు హరీశ్‌రావు తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన భూములు, ప్రస్తుతం ఉన్న భూములు, భౌతిక స్వాధీనం, ట్రస్ట్ పేర్లతో ఉన్న భూములు తదితర అంశాలను కూడా పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. అఫిడవిట్‌లో ఎంత చూపించారు? రికార్డుల్లో ఎంత ఉంది? భౌతికంగా ఎంత ఉంది? బినామీ పేర్లలో ఏమైనా ఉందా? అన్నది అధికారిక రికార్డుల ఆధారంగా తేలాలని అన్నారు. అఫిడవిట్‌లో చూపిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమి ఉన్నట్లు తేలితే దాని చట్టబద్ధతను పరిశీలిస్తామని చెప్పారు. ఒక గుంట తేడా ఉన్నా అది ఎవరి పేరున, ఏ హక్కుతో ఉందో రికార్డుల ద్వారా తేలాలని అన్నారు. హరీశ్‌రావు కుటుంబ సభ్యులు మాజీ సైనికుడి నుంచి భూములు కొనుగోలు చేశారన్న వాదనపై కూడా మంత్రి స్పందించారు. భూమి లావాదేవీ జరిగితే దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, పట్టా, ఇతర చట్టబద్ధమైన డాక్యుమెంట్లు ఉండాలి. ఆ డాక్యుమెంట్లు, వాటి వెనుక ఉన్న రికార్డులు ఏమిటో పరిశీలిస్తాం" అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల పేర్లతో జరిగిన భూ లావాదేవీలకు సంబంధించిన పత్రాలను కూడా అధికారికంగా పరిశీలిస్తామని చెప్పారు. ఏదైనా పత్రం తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నట్లు తేలితే, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిద్ధిపేట ప్రాంతంలో భూ అక్రమాలను వెలికి తీసి అక్కడ ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని వివరించారు. రైతులకు అండగా ప్రజాప్రభుత్వం అసైన్డ్ భూములకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉందని మంత్రి తెలిపారు. అసైన్డ్ భూముల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన అసైన్డ్ భూములపై ఒరిజినల్ పట్టాలు ఉన్నవారిని ఇబ్బంది పెట్టబోమని స్పష్టం చేశారు. పట్టాలు కలిగిన అసైన్డ్ భూములను లాక్కునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. ఈ మేరకు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ముందుగా అసైన్డ్ భూముల పూర్తి వివరాలను తేల్చి, ఆ తర్వాత పక్కనే ఉన్న భూములపై అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రంగనాయకసాగర్ భూముల వ్యవహారంపై రికార్డుల పరిశీలన రంగనాయకసాగర్ పరిసర భూముల విషయంలో అప్పటి ఇరిగేషన్ శాఖ రికార్డులు, ఎఫ్‌టిఎల్ , బఫర్ జోన్, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించాల్సి ఉందని మంత్రి తెలిపారు. అప్పటి పరిస్థితుల్లో సంబంధిత భూములపై శాఖల మధ్య జరిగిన లేఖాచారాలు, భూముల వర్గీకరణలో మార్పులు, రిజిస్ట్రేషన్ జరిగిన విధానం, రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ నిధులు వినియోగించారా లేదా వంటి అంశాలపై పూర్తి వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఇరిగేషన్ శాఖ ఎంత భూమి అవసరమని కోరింది? తర్వాత ఆ భూమి రికార్డుల్లో ఏ మార్పులు జరిగాయి? ఎంత మొత్తానికి రిజిస్ట్రేషన్ జరిగింది? అన్నది డాక్యుమెంట్ల ద్వారా తేలాలని మంత్రి అన్నారు. వట్టినాగులపల్లి భూమిపై వివరణ 'వట్టినాగులపల్లి భూమికి తనకు ప్రత్యక్ష యాజమాన్య సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆ భూమి నాది కాదు. డెవలప్‌మెంట్ కోసం తీసుకున్నాం. నేను రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో ఉన్నాను. నా ప్రాజెక్టులకు అనుమతులు గత ప్రభుత్వాల సమయంలోనే వచ్చాయి. అదే ప్రభుత్వాలు వాటిని నిలిపివేసిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. నేను మంత్రి అయిన తర్వాత తన కుమారుడు వ్యాపారంలోకి రాలేదని, కుటుంబ సభ్యులను రాజకీయ వివాదాల్లోకి లాగడం సరైంది కాదని మంత్రి అన్నారు.

## 'ప్రజాస్వామ్యం' కన్నీరు తుడిచిన హైకోర్టు!..

(మొదటి పేజీ తరువాయి)

కాకపోయినా.. వాటిపై చర్యల విషయంలో చాలాకాలంగా చర్చ కొనసాగుతోంది. అధికార సమీకరణాల్లో భాగంగా ఎమ్మెల్యేలను ఆకర్షించడం, ప్రతిపక్ష బలాన్ని తగ్గించడం వంటి రాజకీయ వ్యూహాలు గతంలోనూ కనిపించాయి. అయితే ప్రజలు ఓట్లతో గెలిపించిన ప్రతినిధులు పార్టీ మారినప్పుడు రాజీనామా చేసి తిరిగి ప్రజా తీర్పు కోరాలనే డిమాండ్ కూడా తరచూ వినిపించింది. తాజా పరిణామాలు పార్టీ ఫిరాయింపులపై రాజకీయ పార్టీల్లోనూ, ప్రజల్లోనూ కొత్త చర్చకు కారణమయ్యాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో భవిష్యత్‌లో తీసుకునే నిర్ణయాలపై ఆసక్తి నెలకొంది. **రెండు పార్టీల మధ్య ఇరుక్కున్న నేతలు** బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కొందరు ఎమ్మెల్యేల రాజకీయ పరిస్థితిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. పార్టీ మారిన తర్వాత ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం, అభివృద్ధి పనులు, రాజకీయ గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తి కొందరు నేతల్లో వ్యక్తమవుతోందని కథనం పేర్కొంటోంది. పార్టీ మారే సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, నియోజకవర్గాల్లో ఎదురవుతున్న సమస్యలు, స్థానిక రాజకీయ ఒత్తిళ్లు నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఫలితంగా కొందరు నేతలు తిరిగి పాత రాజకీయ వేదిక వైపు చూస్తున్నారనే చర్చ కూడా సాగుతోంది. **అధికార పార్టీలోనూ అసంతృప్తి స్వరాలు** కొత్తగా చేరిన ఎమ్మెల్యేలకు పార్టీలో సమన్వయం, పదవులు, ప్రాధాన్యత వంటి అంశాల్లో ఎదురవుతున్న సమస్యలు అసంతృప్తికి కారణమవుతున్నాయని విశ్లేషణలు చెబుతున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై పార్టీ నుంచి ఆశించిన మద్దతు... రాలేదనే భావనతో ఉన్నారని తెలుస్తోంది... దాదాపు చర్చకు దారితీస్తోంది. రాజకీయాల్లో పార్టీ మార్పులు అనేవి కేవలం అధికార సమీకరణాలకు మాత్రమే పరిమితం కాకుండా.. వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతుందనే అంశం తాజా పరిణామాలతో మరోసారి తెరపైకి వచ్చింది. **భవిష్యత్ అడుగులపై ఉత్కంఠ** హైకోర్టు తీర్పు తర్వాత ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్ కార్యాచరణపై ఆసక్తి నెలకొంది. న్యాయపరమైన పరిణామాలు, నియోజకవర్గాల్లో ప్రజాభిప్రాయం, ఆయా పార్టీల వైఖరి ఆధారంగా వారి రాజకీయ ప్రయాణం ఏ దిశగా సాగుతుందనేది కీలకంగా మారింది. పార్టీ మార్పులు తాత్కాలిక రాజకీయ లాభాలను అందించినా.. దీర్ఘకాలంలో ప్రజల విశ్వాసం, రాజకీయ స్థిరత్వం, స్థానిక బలంపై ప్రభావం చూపుతాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.




## మా ఆస్తులు తీసుకొని రూ.వెయ్యి కోట్లు ఇవ్వు: కేటీఆర్

**హైదరాబాద్ :సెప్టెంబర్ 18 :** మా ఆస్తులు తీసుకొని రూ.వెయ్యి కోట్లు ఇస్తే చాలని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన విలేకర్లతో మాట్లాడుతూ.. 'కేసీఆర్ వెయ్యి ఎకరాలు దోచుకున్నా రని రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారం చేశారు. ఇటీవల అసెంబ్లీలో 67 ఎకరాలే ఉన్నాయన్నారు. రూ.వెయ్యి కోట్లు ఇస్తే మీరు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతా. మిగిలిన 99వేల కోట్లతో పథకాలు అమలుచేయండి' అని కేటీఆర్ అన్నారు.

## ఈ నెల 28 నుంచి బంగారు ఉంగరం పథకం

(మొదటి పేజీ తరువాయి)

సమీకరించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆసుపత్రుల్లో జన్మించే శిశువులందరికీ ఈ ఉంగరాలను అందించనున్నట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది.

ప్రతి బంగారు ఉంగరానికి ప్రత్యేక సీరియల్ నంబర్ ఉంటుంది. అలాగే ఉంగరాలను ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్‌లో అందించనున్నారు. ఈ పథకం ప్రయోజనం పొందాలంటే లబ్ధిదారులు తమిళనాడు శాశ్వత నివాసితులై ఉండాలి అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సమన్వయంతో పని చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పని చేసి విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. క్రీడాశాఖ ముఖ్య ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో కలిసి సంజయ్ జాజు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 'జాతీయ క్రీడల తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన టోర్నమెంట్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి క్రీడలను విజయవంతం చేయాలని' సంజయ్ జాజు తెలిపారు.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రకటనలు, బిల్లుల ఆమోదంతో కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. అలాగే సభ ముందుకు వచ్చిన నాలుగు బిల్లులకూ ఆమోదం లభించింది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
ప్రభుత్వ హామీల అమలును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులు, నినాదాలు ఉన్న నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీకి చేరుకున్నారు. వారిని పోలీసులు అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. సమావేశాల్లో నాలుగు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. ఇక 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం పార్టీల బలాబలాల విషయానికి వస్తే.. కాంగ్రెస్‌కు 66 మంది, బీఆర్‌ఎస్‌కు 37 మంది, బీజేపీకి 8 మంది, ఎంఐఎంకు 7 మంది, సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు.

## రైతులు, మిల్లర్ల ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించి సాధ్యమైన పరిష్కారాలను చూపుతామని మంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సర్దుబాటులు, బ్యాంకు గ్యారంటీలు వంటి అంశాలపై అధికారులకు కసరత్తు చేయాలని సూచించినట్లు చెప్పారు. సమస్యలపై మరోసారి నాలుగైదు రోజుల్లో మిల్లర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరిస్తామని ఉత్తమ్ అన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రజాధనం, మిల్లింగ్ రంగం స్థిరత్వం మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేస్తూ.. ప్రస్తుతం కొనసాగుతున్న సమ్మెను విరమించి ప్రభుత్వంతో చర్చలకు సహకరించాలని మిల్లర్లకు విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

యూనియన్లకు తుది ఓటర్ల జాబితా పంపిణీ, పోటీలో ఉండే యూనియన్లకు గుర్తుల కేటాయింపు, జిల్లాల డీసీఎల్లు తుది ఓటర్ల జాబితాను ప్రధాన ఓటర్లింగ్ అధికారికి సమర్పించడం. సెప్టెంబర్ 29 (మంగళవారం): పోటీ చేసే యూనియన్లకు నమూనా బ్యాలెట్ పత్రాలను డీసీఎల్ వద్ద నుంచి సేకరించడం. అక్టోబర్ 09 (శుక్రవారం): పోలింగ్ తేదీ (ఉదయం 5:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకు). అక్టోబర్ 14 & 15: పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ. అక్టోబర్ 17 (శనివారం): ఫలితాల ప్రకటనగుర్తింపు ఇలా ఆర్టీసీలో అనేక కార్మిక సంఘాలు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన సంఘాన్నే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు సంఘాలు రీజియన్, రాష్ట్రస్థాయిలో ఉంటాయి. రెండింటికీ వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏలు, సర్వీస్ నిబంధనలు తదితర సమస్యలపై సంస్థ యాజమాన్యం ప్రభుత్వంతో చర్చలు జరిపే చట్టబద్ధమైన హక్కు ఈ సంఘానికి ఉంటుంది. కార్మికుల తరఫున ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలకంగా వ్యవహరిస్తోంది. రీజియన్‌లో పనిచేసే అధికారి స్థాయి మినహా మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరికీ ఓటు హక్కు ఉంటుంది. 2018లో ఈ ఎన్నికలు జరగాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం నిర్వహించలేదు.

## వాళ్లలాగా నేను కబ్జాలు పెట్టలేదు: హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము దోచుకోలేదన్నారు. సిద్దిపేట ప్రజలు తన పని చూసి ఏడు సార్లు గెలిపించారని, తనని దీవించారని, కాంగ్రెస్ వాళ్లు అంత భయపడాల్సిన అవసరం లేదని, మా సిద్దిపేట అంటేనే ప్రేమ, ఆప్యాయత, ఆతిథ్యానికి చిరునామా అని ప్రశంసించారు. సిద్దిపేటకు ఎవరు వచ్చినా కడుపునిండా అన్నం పెడతాం, ప్రేమగా మాట్లాడుతానని హరీష్ రావు పేర్కొన్నారు. అంత మంది పోలీసులు పెట్టుకొని భయపడుకుంటూ రావాల్సిన అవసరం కాంగ్రెస్ వాళ్లకు లేదన్నారు.

## మసీదులో ఆత్మాహుతి దాడి..15 మంది మృతి



**హైదరాబాద్ :సెప్టెంబర్ 18):** పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కోహాట్ జిల్లాలో శుక్రవారం ప్రార్థనల సమయంలో ఒక మసీదులో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 15 మంది మృతి చెందగా, 30 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి మసీదు గోడ కూలిపోయింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# పద్మశాలి ప్రతిభావంతుడు డాక్టర్ శివప్రసాద్‌కు ఘన సన్మానం

**●కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఉమ్మడి గాజులరామారం డివిజన్**







**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
అక్యుప్రెషర్, అక్యుపంక్చర్ వైద్య రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న పద్మశాలి సమాజానికి చెందిన డాక్టర్ శివప్రసాద్‌కు ఘన సన్మానం నిర్వహించారు. ఉమ్మడి గాజులరామారం డివిజన్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, బీజేపీ ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి డాక్టర్ శివప్రసాద్‌కు "పద్మచక్ర టాలెంటెడ్ అవార్డు" అందించిన సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ చేతుల మీదుగా డాక్టర్ శివప్రసాద్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, మహంకాళి--సికింద్రాబాద్ జిల్లా ఇన్‌చార్జి నందనం దివాకర్, ఉమ్మడి గాజులరామారం డివిజన్ పద్మశాలి సేవా సంఘం జాయింట్ సెక్రెటరీ సామంతుల రాజు, బీజేపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని డాక్టర్ శివప్రసాద్‌ను అభినందించారు.
ఈ సందర్భంగా సాయినాథ్ నేత మాట్లాడుతూ పద్మశాలి సమాజానికి చెందిన ప్రతిభావంతులు వివిధ రంగాల్లో రాణిస్తూ సమాజానికి, రాష్ట్రానికి సేవ చేయడం గర్వకారణమన్నారు. డాక్టర్ శివప్రసాద్ వైద్య రంగంలో అందిస్తున్న సేవలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# నత్తనడకన మసీదుగడ్డ రోడ్డు పనులు

**నెల రోజులుగా పనులు.. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు**
**రోడ్డు పనులు వేగవంతం చేయాలని స్థానికుల డిమాండ్.**





**జూబ్లీహిల్స్: సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
మసీదుగడ్డ రోడ్డు పనులు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో రోడ్డు పొడవునా మట్టి కుప్పలు వేయడంతో పలు మార్గాలు మూసుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.ఇళ్లకు వెళ్లేందుకు, వాహనాలను తీసుకెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదుల మేరకు రహదారిని పరిశీలించి, +ఎవీజ ఏఈతో పాటు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

**ఏడాదిగా ఎదురుచూపులు.**
సుమారు రూ.1.10 కోట్ల అంచనా వ్యయంతో 25-07-2025న రోడ్డు పనులకు శాంక్షన్ జరిగినప్పటికీ సుమారు ఏడాది కాలం పనులు ప్రారంభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనంతరం పనులు ప్రారంభమైనప్పటికీ, ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయని వారు పేర్కొంటున్నారు.
ప్రధాన రహదారిపై మట్టి కుప్పలు, పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో +ఎవీజ అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# మధు యాష్కీకి ఘన సన్మానం

**హైదరాబాద్: సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**



ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీని కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్, ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ పసుపులేటి వీరభాస్కర్‌రావు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా కన్వీనర్ మొగిలిపాక వెంకటేష్ తదితరులు మధు యాష్కీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భవిష్యత్‌లో పార్టీ అనుబంధ సంఘాలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అంశాలపై చర్చించారు. ప్రొఫెషనల్స్‌ను పార్టీ కార్యక్రమాల్లో మరింత భాగస్వామ్యం చేయడం, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

# ఏసీబీ వలలో గోవిందరావుపేట తహసీల్దార్

**- రూ.14 వేల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబాటు**

**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**




పూర్వీకుల వ్యవసాయ భూమి వారసత్వ బదిలీ విషయంలో అనుకూలంగా వ్యవహరి ంచేందుకు రూ.14 వేల లంచం తీసుకుం టుండగా గోవిందరావుపేట తహసీల్దార్ నెల్లూట్ల సృజన్ కుమార్ ఏసీబీ అధికారు లకు పట్టుబడ్డట్లు తెలంగాణ అవినీతి నిరోధక బ్యూరో వెల్లడించింది.ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదా రుడి భార్య లింగాల శ్రీలతకు సంబంధిం చిన పూర్వీకుల వ్యవసాయ భూమి వారసత్వ బదిలీ వ్యవహారంలో అధికారికం గా అనుకూలంగా వ్యవహరించేందుకు తహసీల్దార్ తొలుత రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు పేర్కొంది. అనంతరం బేరసారాల తర్వాత రూ.14 వేలకు తగ్గించినట్లు తెలిపింది.ఈ మేరకు ఫిర్యాదుదారుడి సమాచారం ఆధారంగా ఏసీబీ వరంగల్ రేంజ్ అధికారులు శుక్రవారం ఉచ్చు పన్నారు. గోవిందరావుపేట మండల రెవెన్యూ కార్యాలయంలో నిందిత అధికారి లంచం మొత్తాన్ని స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ ప్రకటించింది.ఉచ్చు ప్రక్రియలో భాగంగా నిందిత అధికారి లంచం మొత్తాన్ని కుడిచేతితో స్వీకరించి, ప్యాంటు కుడి జేబులో పెట్టుకున్నట్లు ఏసీబీ తెలిపింది. అనంతరం ఆ మొత్తాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొంది. నిందిత అధికారి కుడిచేతి వేళ్లపై నిర్వహించిన రసాయన పరీక్షలో సానుకూల ఫలితం వచ్చినట్లు వెల్లడించింది.ప్రభుత్వ విధులను సక్రమంగా, నిజాయితీగా నిర్వహించాల్సిన అధికారి అక్రమ ప్రయోజనం కోసం లంచం స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది. నిందిత అధికారిని అరెస్టు చేసి వరంగల్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించింది.
ఫిర్యాదుదారుడి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయన గుర్తింపు, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ పేర్కొంది.

**లంచం డిమాండ్ చేస్తే 1064కు సమాచారం.**
ప్రభుత్వ అధికారి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని అవినీతి నిరోధక బ్యూరో కోరింది. అలాగే వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారుల పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

# హాస్టల్ గదిలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

**- దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన**
**- బహదూర్‌పల్లిలో ఘటన.. కేసు నమోదు చేసి దర్యాప్తు**

**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**



దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లి ప్రాంతంలో ఓ బీటెక్ విద్యార్థి హాస్టల్ గదిలో ఉరివేసుకుని మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. సాయిచరణ్ (20), శ్రీనివాస్ కుమారుడు, మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గత మూడేళ్లుగా బహదూర్‌పల్లిలోని వారాహి బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు.బుధవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో సాయిచరణ్ స్నేహితులు సినిమాకు వెళ్లగా, అతను ఒక్కడే హాస్టల్ గదిలో ఉన్నాడు. సినిమా చూసుకుని సుమారు రాత్రి ఒంటి గంటకు తిరిగి వచ్చిన స్నేహితులు తలుపు తట్టినా స్పందన రాకపోవడంతో అతను నిద్రపోతున్నాడని భావించి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మరోసారి తలుపు తట్టినా తీయక పోవడంతో అనుమానం వచ్చి తలుపు తెరిచి చూడగా సాయిచరణ్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాయిచరణ్ మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# నవజీవ నగర్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు

-- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి
భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ప్రారంభం



**బాలానగర్ సెప్టెంబర్ 19 ( పీపుల్స్ న్యూస్)**
బాలానగర్ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరై వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణలు, భక్తుల సందడి మధ్య ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. అనంతరం భక్తుల కోసం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం ప్రసాదించాలని శ్రీ గణేశుడిని ప్రార్థించినట్లు తెలిపారు. వినాయక చవితి పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నవజీవ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. పండుగలను ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా నవజీవ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో కాలనీలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో నవజీవ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు, యువతతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉమ్మడి పౌరస్మృతిపై బిజెపి ఉబలాటం

యూనిఫారం సివిల్ కోడ్ (యుసిసి) అంటే ఉమ్మడి పౌరస్మృతి. దీని ముఖ్య ఉద్దేశం 'అందరికీ ఒకే పౌరచట్టం'. ఇది రాజ్యాంగ నిర్మాతలు భవిష్యత్ తరాల ముందు ఉంచిన ఒక ఆదర్శ లక్ష్యం. దేశం లోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలు, ఆచారాలు, సంప్రదాయాలను సమన్వయం చేసి వారందరూ స్వచ్ఛందంగా ఒకే విధమైన చట్టాన్ని అంగీకరించేలా చేయడం చాలా పెద్ద ప్రయత్నమే కాకుండా కష్ట సాధ్యమని ఆనాటి రాజ్యాంగ నిర్మాతలకు ముందే తెలుసు. ఈ విషయంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఎంతవరకు సుసాధ్యం చేయగలుగుతుందో గమనించాల్సిందే. యుసిసిని కేవలం యాంత్రికంగా అమలు చేయడం కాకుండా, రాజ్యాంగ రక్షణలో ప్రతివ్యక్తికి న్యాయం జరిగేలా, సమాజం లోని ప్రతి వర్గాన్ని ఉత్తమమైన పౌర చట్టాల స్థాయికి తీసుకెళ్ల గలగాలి.మైనారిటీలను ఇతరులుగా లేదా పరాయి వారిగా భావించే పరిస్థితి రాకుండా అందరికీ వర్తించే ఉమ్మడి పౌర చట్టాన్ని అమలు లోకి తీసుకు రావాలి. దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌డిఏ ప్రభుత్వానికి ఆసక్తిగా ఉంటే వివిధ వర్గాల ప్రజలు, మత పెద్దలు, పౌర సమాజ ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులతో విస్తృతంగా చర్చలు జరపాలి. తన లక్ష్యాలు, ఉద్దేశాల విషయంలో పారదర్శకంగా ఉండాలి. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయానికి వచ్చేలా చేయగలిగితే బిజెపి దేశానికి ఒక మంచి సేవ చేసినట్టు అవుతుంది. అలా కాకుండా రాజకీయ కోణంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలన్న తాపత్రయంతో ఎన్నికల ప్రచార నినాదంగా యుసిసిని వాడుకోరాదు.కానీ ఇప్పటివరకు ఎన్‌డిఏ ప్రభుత్వ చర్యలు గమనిస్తుంటే 2029 పార్లమెంట్ ఎన్నికలకు యుసిసి ప్రధాన ప్రచార అస్త్రంగా వినియోగించుకోనున్నట్టు బయటపడుతోంది. అయితే జాతీయ స్థాయిలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. పార్లమెంట్‌లో ఎన్‌డిఏకు ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఆ రాజ్యాంగ సవరణ చేపట్టడం సాధ్యం కాదు. అందుకనే తమ ప్రభుత్వ పాలనలో ఉన్న 21 రాష్ట్రాల్లోనే విడతల వారీగా ఈ కోడ్‌ను అమలు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం.ఇప్పుడు దేశ వ్యాప్త చర్చకు తెరతీసినట్టయింది.యూనిఫారం సివిల్ కోడ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నది బిజెపి దీర్ఘకాలిక లక్ష్యాల్లో ఒకటి. బిజెపి ఆవిర్భవించిన నాటి నుంచి యుసిసి అమలు విషయంలో తన విధానాన్ని స్పష్టంగా ప్రకటిస్తూ వచ్చింది. అయితే ఈ కోడ్ ఎలా ఉండాలి? దీని పూర్తి వివరాలు ఏమిటి? తదితర విషయాలను ఇప్పటివరకు బిజెపి వెల్లడించకపోవడం గమనించాల్సిన విషయం. తన కనుసన్నల్లో నడుస్తున్న 21 రాష్ట్రాల్లో యుసిసిని అమలు చేయడానికి బిజెపి సిద్ధమవుతున్నా దీని మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత కనిపిస్తోంది. బీహార్ లోని నితీశ్ కుమార్ సారథ్యం లోని జనతాదళ్ (యునైటెడ్), యుసిసి భావనకు మద్దతు ఇచ్చినప్పటికీ, అమలుకు మాత్రం అంగీకరించడం లేదు. మరో మిత్రపక్షం ఆంధ్రప్రదేశ్ లోని తెలుగుదేశం ప్రభుత్వం కూడా యుసిసి ఆలోచనకు కట్టుబడి ఉన్నామని చెబుతూ దీనిపై మరింత చర్చ జరగాలని కోరుతోంది.ఈ రెండు మిత్రపక్షాల మద్దతు వల్లనే కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం మనుగడ సాగిస్తోంది. అందువల్ల కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన సూచనకు ఇవి ఎలాంటి షరతులు లేకుండా వెంటనే మద్దతు ఇస్తాయని అనుకోవడం అంత సులభం కాదు. యుసిసి ప్రధాన లక్ష్యం 'సమానత్వం'. ఇది భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కు. అయితే రాజ్యాంగం లోని ఆర్టికల్ 44 న్యాయస్థానంతో నేరుగా అమలు చేయలేని 'ఆదేశిక సూత్రాల్లో' భాగంగా ఉంది. దేశం లోని విభిన్న మతాలు, సమాజాల కోసం చారిత్రకంగా ఏర్పడిన వివిధ వ్యక్తిగత చట్టాలు ఉన్నందున యుసిసి అమలు అనేక అంశాలతో ముడిపడి ఉంది. ఉత్తరాఖండ్ 2024లో యుసిసి చట్టాన్ని అమలులోకి తెచ్చింది. అది వివాహం, విడాకులు, వారసత్వం వంటి అంశాలను నియంత్రిస్తుంది. ఇక్కడ షెడ్యూల్డ్ తెగలకు రాజ్యాంగ పరంగా కొంత మినహాయింపు కల్పించారు. గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం రాష్ట్రాలు కూడా ఇలాంటి చట్టాలను ఆమోదించాయి.

# చేనేతకు చేయూత.. నేతన్నకు భరోసా.

- ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం ఆధ్వర్యంలో వస్త్ర ప్రదర్శన
- మసాబ్‌ట్యాంక్‌లో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రాలు

**హైదరాబాద్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**

చేనేత కళకు ప్రోత్సాహం అందించడంతో పాటు నేతన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఐపీఎస్ అధికారుల సతీమణుల సంఘం (IPSOWA) ఆధ్వర్యంలో వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. మసాబ్‌ట్యాంక్‌లోని పోలీసు అధికారుల మెస్‌లో 'థ్రెడ్స్ ఆఫ్ హోప్ -- వేర్ ఎవరీ థ్రెడ్ టెల్స్ ఎ స్టోరీ' పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభించింది.సంఘం అధ్యక్షురాలు లలితా ఆనంద్, కార్యదర్శి రీతూ జైన్ ఆధ్వర్యంలో












నిర్వహించిన ఈ ప్రదర్శనలో తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత, హస్తకళాకారులు తమ ఉత్ప త్తులను ప్రదర్శించారు. నారాయణపేట, గద్వాల్, పోచంపల్లి, దుబ్బాక, మంగళగిరి తదితర ప్రాంతాల సంప్రదాయ చేనేత వస్త్రాలతో పాటు జమ్దానీ, కలంకారీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీతో కూడిన లినెన్ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**చేనేతకు మార్కెట్ అవసరం.**

ఈ సందర్భంగా లలితా ఆనంద్ మాట్లాడుతూ దేశ సాంస్కృతిక వారసత్వంలో చేనేత, హస్తకళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తరతరాలుగా నేత కార్మికులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నారని తెలిపారు. చేనేత కార్మికులు, హస్తకళాకారులను నేరుగా వినియోగదారులతో అనుసంధానం చేయడం ద్వారా వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నేతన్న కుటుంబాల జీవనోపాధికి కొంతమేర భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు.

**రూ.13 లక్షల మేర వ్యాపారం.**

ప్రదర్శనకు అఖిల భారత సర్వీసుల అధికారుల కుటుంబాలు, ఇతర అధికారులు, వారి సతీమణులు, కుటుంబ సభ్యుల నుంచి విశేష స్పందన లభించింది. పలువురు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో సుమారు రూ.13 లక్షల మేర వ్యాపారం జరిగినట్లు నిర్వాహకులు, చేనేత కళాకారులు తెలిపారు.చేనేత, హస్తకళాకారులకు మార్కెట్ అవకాశాలు కల్పించే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఇపుసొవా నిర్ణయించింది. వివిధ సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు మరింత ప్రచారం, మార్కెట్ అవకాశాలు కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం వెల్లడించింది.

# గణేష్ సురక్ష సంకల్ప్‌లో ట్రాఫిక్ అవగాహన







**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
గణేష్ సురక్ష సంకల్ప్‌లో భాగంగా మల్కాజ్‌గిరి కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో వాసవి నగర్ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాసవి నగర్ స్ట్రీట్ నంబర్-2లో గణేష్ సురక్ష సంకల్ప్ డే-1 కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ త్రిముల్ఘేరీ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు, కార్ఖానా ఎస్‌హెచ్ఓ అనురాధ, ఎస్ఐ అశోక్ రెడ్డి, ట్రాఫిక్ త్రిముల్ఘేరీ పోలీస్ స్టేషన్ అదనపు ఇన్‌స్పెక్టర్ వి. రామనయ్య, ఎస్ఐ మారుతి, రోడ్డు భద్రత, సహచారిణి బృందాల సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులు, ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ ఉల్లంఘనలకు దూరంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను సురక్షితంగా నడపాలని సూచించారు.అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన క్విజ్ పోటీ నిర్వహించారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొనగా, విజేతలకు ఏసీపీ ట్రాఫిక్ త్రిముల్ఘేరీ డివిజన్ తరఫున హెల్మెట్లను బహుమతులుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన రోడ్డు వినియోగంపై చైతన్యం కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.

## ఉద్యోగం లెక్కలేదా.. ముడుపుల ఆరోపణలపై

# మౌనమేలా?

- మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారా?
- గాజులరామారం సర్కిల్--57 టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు.



**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)** నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌తో పాటు కమర్షియల్ భవనం నిర్మాణం జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు గాజులరామారం సర్కిల్--57 పరిధిలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణంపై పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత భవనానికి జీం2 రెసిడెన్షియల్ అనుమతులు ఉన్నట్లు పేర్కొంటూ.. వాస్తవంగా కమర్షియల్ వినియోగం, సెల్లార్ నిర్మాణం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నదా? అనుమతుల్లో పేర్కొన్న నిర్మాణానికి భిన్నంగా పనులు చేపట్టారా? అన్న విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.




**కమిషనర్ ఆదేశాలు.. కాగితాలకే పరిమితమా?**

మున్సిపల్ కమిషనర్ స్థాయిలో ఇచ్చిన ఆదేశాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితమైతే వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ఎవరిది? అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం ఎందుకు మౌనం వహిస్తోంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**చర్యలు ఎప్పుడో?**

పత్రికా కథనాలు, స్థానికుల ఫిర్యాదులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అంశాలు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, సెల్లార్‌కు అనుమతి, భవన వినియోగం, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్రంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తే.. ప్రజల ఫిర్యాదులకు విలువ ఎక్కడ? ఉన్నతాధికారుల ఆదేశాలకు అమలు ఎక్కడ? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఈ భవనంపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి? అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుందా? మున్సిపల్ కమిషనర్ ఆదేశాలపై ఏ చర్యలు చేపట్టారు? అనే అంశాలపై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంది.



చితారమ్మ టెంపుల్ ట్రెండ్స్ ఆపోజిట్ అక్రమ సెల్లార్, కమర్షియల్ భవనం

## నిర్మల్ జిల్లా వడ్తాల్ శ్రీ విద్యా స్కూల్ ఉపాధ్యాయునికి 'ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డు




**ముధోల్ ,సెప్టెంబర్18:** తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (TRSMA) నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా వడ్తాల్ గ్రామంలోని శ్రీ విద్యా స్కూల్ ఉపాధ్యాయుడు శ్రీ గంగాధర్ "ఉత్తమ ఉపాధ్యాయుడు" అవార్డుకు ఎంపికయ్యారు.ఇటీవల వైభవంగా జరిగిన ఈ అవార్డుల వేడుకలో జిల్లా విద్యాశాఖ అధికారులు మరియు టీఆర్ఎస్ఎంఏ ప్రతినిధుల సమక్షంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.విద్యా రంగంలో గంగాధర్ గారు అందిస్తున్న విశేష సేవలకు, ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.శ్రీ గంగాధర్ గారు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ నిబంధనలకి విరుద్ధంగా నిర్వహిస్తున్న ఉజ్వల హైస్కూల్ పై చర్యలు తీసుకోవాలి

**- జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పూరెళ్ల నీతిష్**



**మంచిర్యాల, సెప్టెంబర్ 18:** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకి విరుద్ధంగా నిర్వహిస్తున్న ఉజ్వల హైస్కూల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి కి వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్బంగా జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పూరెళ్ల నీతిష్ మాట్లాడుతూ, నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకి విరుద్ధంగా, కనీస సౌకర్యాలు లేకుండా పాఠశాలని నిర్వహిస్తున్నారని అన్నారు.అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు.రేకుల షెడ్లో, ఇరుకు గదులో తరగతులు నిర్వహిస్తు విద్యార్థులని ఇబ్బందులకి గురిచేస్తున్నారని అన్నారు.విద్యార్థులు ఆడుకోవడానికి అట స్థలం కూడా లేదని, ప్రభుత్వ నిబంధనలని తుంగలో తోకి ఇష్టనుసారంగా వ్యవహారిస్తున్న ఉజ్వల పాఠశాల పై విచారణ జరిపి, పాఠశాల పై చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం తరుపున డిమాండ్ చేసారు.

## రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన హాస్టల్ అధికారి

- ఆరు రోజుల గైర్హాజరును అనధికారికంగా నమోదు చేయకుండా ఉండేందుకు లంచం డిమాండ్
- పాల్వంచ ఎస్టీ బాలుర హాస్టల్ వార్డెన్/రికార్డ్ అసిస్టెంట్ అరెస్ట్

**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)** ఉద్యోగికి సంబంధించిన గైర్హాజరు నమోదులో అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.14 వేల లంచం తీసుకుంటూ ఎస్టీ బాలుర హాస్టల్ వార్డెన్/రికార్డ్ అసిస్టెంట్, ఇన్‌చార్జి అధికారి ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.ఏసీబీ ప్రకటన ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పాల్వంచలోని ఎస్టీ బాలుర హాస్టల్ వార్డెన్/రికార్డ్ అసిస్టెంట్‌గా, సత్యనారాయణపురం ఎస్టీ బాలుర హాస్టల్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న బుక్య వలుసింహ ఆగస్టు 2026లో ఫిర్యాదుదారు ఆరు రోజుల పాటు గైర్హాజరైన విషయాన్ని అనధికారిక గైర్హాజరుగా నమోదు చేయకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు పేర్కొంది.అలాగే భవిష్యత్తులో ఉద్యోగపరమైన ప్రతికూల పరిణామాలు లేకుండా చూడటంతో పాటు జీతం బిల్లుల తయారీలో ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఉండేందుకు తొలుత రూ.15 వేలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. అనంతరం బేరసారాల తర్వాత రూ.14 వేలకు అంగీకరించినట్లు పేర్కొంది. 18.09.2026న ఫిర్యాదుదారు నుంచి రూ.14 వేల లంచం స్వీకరిస్తుండగా ఖమ్మం రేంజ్ ఏసీబీ అధికారులు నిందిత అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఏఓ రెండు చేతులకు నిర్వహించిన రసాయన పరీక్షల్లో పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు ఏసీబీ పేర్కొంది.లంచం స్వీకరించడం ద్వారా నిందిత అధికారి తన విధిని అక్రమంగా, నిజాయితీకి విరుద్ధంగా నిర్వర్తించినట్లు ఏసీబీ తెలిపింది. నిందితుడిని అరెస్టు చేసి వరంగల్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు వెల్లడించింది. కేసు దర్యాప్తులో ఉంది.




**లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ అధికారి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ సూచించింది. వాట్సాప్ ద్వారా 9440446106కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారు, బాధితుడి గుర్తింపు వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

## నాయక్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

**- వినాయక చవితి సందర్భంగా సేవా కార్యక్రమం**

**- భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన గుగులోతు బాలకృష్ణ నాయక్**



**కుత్బుల్లాపూర్ /జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 18 :** వినాయక చవితి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట నుంచి షాపూర్ వరకు గల నాయక్ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కార్యక్రమానికి నాయక్ ఆటో స్టాండ్ అధ్యక్షుడు గుగులోతు బాలకృష్ణ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల్లో ఆటో డ్రైవర్లు ముందుండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బుక్యా హేమా నాయక్, నిర్వాహకులు బుక్యా ఉదయ్, కర్ణాటక రాజు, రామ్మోతు ఉదయ్, నాగరాజుతో పాటు నాయక్ ఆటో స్టాండ్ సభ్యులు, ఆటో డ్రైవర్లు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నప్రసాదం అందజేసి, వినాయకుడి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలి

- బడా గణేశ్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన నీలం మధు ముదిరాజ్
- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి














**పటాన్ చెరు: సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
ఖైరతాబాద్‌లో కొలువుదీరిన బడా గణేశ్‌ను మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర స్వామిని ప్రార్థించి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.దర్శనం అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు నీలం మధు ముదిరాజ్‌కు ఘన స్వాగతం పలికారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనాలతో సత్కరించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్ బడా గణేశ్ ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్న మహా గణపతి అని అన్నారు. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా బడా గణేశ్‌ను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యత, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. విఘ్నేశ్వరుని కృపతో ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యం నెలకొనాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్, ఫౌండర్ వీణ మాధురి, రాజశేఖర్, మొగోల్, రాజు, బాబుల్, సందీప్, రాకేష్, అభిషేక్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి 248 డివిజన్‌లో బీజేపీ జెండా పండుగ

- బీజేపీ, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కార్యక్రమం
- పార్టీ జెండాను ఆవిష్కరించిన డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18 :**
శేరిలింగంపల్లి 248 డివిజన్‌లో బీజేపీ, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్తీ దవాఖాన సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భూపాల్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ యాదవ్, శివకుమార్, బీజేవైఎం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, ఓబీసీ నాయకులు లోకేష్, రామరాజు, ఓబీసీ ఉపాధ్యక్షుడు నాగరాజు, పటేల్ ప్రభాకర్, పటేల్ ప్రతాప్‌రెడ్డి, సంధ్యారాణి, రజినితో పాటు బీజేపీ, ఓబీసీ మోర్చా, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయం

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ముధోల్ (నిర్మల్), సెప్టెంబర్ 18:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ ఇచ్చిన సంచలన తీర్పు ప్రజాస్వామ్య విజయమని బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికార బలంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించిందని దుయ్యబట్టారు. ఎంతో మంది ఎమ్మెల్యేలను ఇతర పార్టీల నుంచి తమ వైపునకు తిప్పుకుంటూ వింత క్రీడను ప్రోత్సహించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు ఒక చెంపపెట్టు లాంటిదని విమర్శించారు. న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తాము చేసిన పోరాటం ఫలించిందని స్పష్టం చేశారు. బీజేపీ దాఖలు చేసిన రిట్ పిటిషన్ ఆధారంగానే దానం నాగేందర్‌పై ఈ అనర్హత వేటు పడిందని గుర్తు చేస్తూ, ఇకనైనా ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను కాంగ్రెస్ మానుకోవాలని హితవు పలికారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవ హరించిన వారికి న్యాయస్థానాల్లో శిక్ష తప్పదనితీర్పు ద్వారా నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు.

# నూతన డివిజనల్ ఇంజనీర్‌కు ఘన సన్మానం



- ఎల్లారెడ్డి డివిజనల్ ఇంజనీర్‌గా సత్యనారాయణ బాధ్యతలు

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18 :**
ఎల్లారెడ్డి డివిజనల్ ఇంజనీర్‌గా శ్రీ డి. సత్యనారాయణ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్--142) ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కంపెనీ సెక్రటరీ ఏ. నాగరాజు, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బి. స్వామి, కంపెనీ జాయింట్ సెక్రటరీ వి. మోతిలాల్, కామారెడ్డి జిల్లా ప్రాంతీయ అధ్యక్షులు కిష్టయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

# జీవో 97కు వ్యతిరేకంగా 'చలో ఇందిరా పార్క్'కు అనుమతి నిరాకరణ

- శాంతిభద్రతల దృష్ట్యా పోలీసుల నిర్ణయం
- పాలిటెక్నిక్ జేఏసీ ఆందోళన.. మరో తేదీన ధర్నాకు సన్నాహాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి మారుస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ చేపట్టనున్న 'చలో ఇందిరా పార్క్' కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. సెప్టెంబర్ 18న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించేందుకు జేఏసీ ప్రతినిధులు ఏర్పాట్లు చేయగా, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. పోలీసుల ప్రకారం, రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 5 వేల నుంచి 6 వేల మంది విద్యార్థులు ధర్నాకు తరలివచ్చే అవకాశం ఉందని నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. భారీ సంఖ్యలో విద్యార్థులు ఒకేచోటకు చేరితే నగరంలో ట్రాఫిక్ సమస్యలతో పాటు శాంతిభద్రతలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాతోకార్యక్రమానికిఅనుమతినిరాకరించినట్లు సమాచారం.

**పోలీసుల నిర్ణయంపై జేఏసీ అభ్యంతరం**
ధర్నాకు అనుమతి నిరాకరించడంపై పాలిటెక్నిక్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, డీఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు ఎరవెల్లి జగన్, కన్వీనర్ జనార్ధన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్థులు శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని పోలీసు అధికారులకు పలుమార్లు తెలియజేసినప్పటికీ అనుమతి ఇవ్వకపోవడం సరికాదని వారు పేర్కొన్నారు. జీవో 97పై తమ అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విద్యార్థులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడుతున్నారని జేఏసీ నేతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి జీవో 97పై పునరాలోచించాలని కోరారు. మరో తేదీన ధర్నాప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో 'చలో ఇందిరా పార్క్' కార్యక్రమాన్ని మరో తేదీన నిర్వహించేందుకు నిర్ణయిస్తామని పాలిటెక్నిక్ జేఏసీ నేతలు ప్రకటించారు. విద్యార్థులను సమీకరించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీలకు ఉచిత వైద్య సాయం

- ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం
- రూ.5 లక్షల్లోపు కుటుంబ వార్షిక ఆదాయం ఉంటే అర్హత
- అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు, సెప్టెంబర్ 18 :**
తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఎస్సీ, ఎస్టీ రోగులు డాక్టర్ అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5 లక్షలకు మించని ఎస్సీ, ఎస్టీలు ఈ పథకానికి అర్హులని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె శస్త్రచికిత్సలు, డయాలసిస్, క్యాన్సర్ కీమోథెరపీ, రేడియోథెరపీ, మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలు, మూత్రపిండాలు, కాలేయం తదితర అవయవాల మార్పిడికి నిబంధనల మేరకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. మంజూరైన మొత్తాన్ని నేరుగా చికిత్స నిర్వహించే ఆసుపత్రి ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. అర్హులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, రోగి ఫొటో, ఆసుపత్రి ధ్రువీకరించిన చికిత్స అంచనా వివరాలతో చికిత్స తేదీకి కనీసం 15 రోజుల ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## పలు గ్రామాల్లో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హార్స్ చౌదరి పర్యటన



**బెజ్జూరు, సెప్టెంబర్ 18 :** మండలంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హార్స్ చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బెజ్జూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించారు.అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# లీ చీ కా రాజా గణేష్‌పై అసత్య ప్రచారం

- ●తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు.. షేర్ చేయొద్దు
- ●ప్రజలకు గోషామహల్ పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)** గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిష్టించిన 'లీ చీ కా రాజా గణేష్--2026' విగ్రహానికి సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను పోలీసులు ఖండించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో విగ్రహం తయారీ, విలువైన లోహాలు, బంగారు పూత, వజ్రాలకు సంబంధించి ప్రచారం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసులు తెలిపారు.సోషల్ మీడియాలో విగ్రహాన్ని సుమారు 48 కిలోల పంచలోహాలతో తయారు చేశారని, 24 క్యారెట్ల బంగారు పూత పూశారని, 3,83,800 అమెరికన్ డైమండ్లను అమర్చారని ప్రచారం జరుగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యంగా 24 క్యారెట్ల బంగారు పూతకు సంబంధించిన ప్రచారం వల్ల విగ్రహం కోట్లాది రూపాయల విలువైన బంగారంతో తయారైనట్లు ప్రజల్లో అపోహలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.పోలీసుల స్పష్టతసోషల్ మీడియాలో జరుగుతున్న ఈ



ప్రచారంలో వాస్తవం లేదని గోషామహల్ పోలీసులు స్పష్టం చేశారు. విగ్రహం ప్రచారంలో పేర్కొన్న విలువైన లోహాలు లేదా బంగారు పూతతో తయారు కాలేదని, ముఖ్యంగా 24 క్యారెట్ల బంగారు పూత పూశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు.విగ్రహానికి సంబంధించి తప్పుడు సమాచారం ప్రచారం చేయడం వల్ల భక్తుల్లో అనవసరమైన అపోహలు ఏర్పడటంతో పాటు ఉత్సవాల సమయంలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు.ఆధారాలు లేని ప్రచారాలకు దూరంగా ఉండాలివాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలు, ఫొటోలు, వీడియోలను వాస్తవ నిర్ధారణ లేకుండా నమ్మవద్దని, ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దని పోలీసులు సూచించారు. విగ్రహం బరువు, పంచలోహాలు, వజ్రాల సంఖ్య, బంగారు పూతకు సంబంధించిన వివరాలపై అధికారికంగా వెల్లడించే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు.అదేవిధంగా నిజానిజాలు నిర్ధారించుకోకుండా పుకార్లు, తప్పుడు సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.విఘ్నేశ్వరుని నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని గోషామహల్ పోలీసులు కోరారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



## చదువుతోనే బంగారు భవిష్యత్తు

## గంజాయి జోలికెళ్తే చట్టపరమైన చర్యలు: బెజ్జూరు ఎస్సై విజయ్

**బెజ్జూరు, సెప్టెంబర్ 18:** విద్యార్థులు చదువుపై దృష్టి సారించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బెజ్జూరు ఎస్సై విజయ్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని, వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సపన్ మండల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భైంసాలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ ఆదేశం



**ముధోల్(భైంసా), సెప్టెంబర్ 1:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భైంసా పట్టణంలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. పట్టణంలో గణనాథుల శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాలను నిశితంగా పరిశీలించిన ఆయన, అనంతరం నిమజ్జనం జరిగే ప్రముఖ గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ...ఉత్సవాల్లో అత్యంత కీలకమైన నిమజ్జన ఘట్టాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగినన్ని లైట్లు, తాగునీరు, పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని,గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ పర్యటనలో వివిధ శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్ట్

- ●మహిళపై అసభ్య ప్రవర్తన, అక్రమ ప్రవేశం, బెదిరింపుల ఆరోపణలు
- ●మరో ముగ్గురు పరారీలో.. దర్యాప్తు కొనసాగిస్తున్న గోషామహల్ పోలీసులు









**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)** గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం, మహిళ పట్ల అసభ్య ప్రవర్తన, అక్రమ ప్రవేశం, ఆస్తి ధ్వంసం, క్రిమినల్ బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. క్రైమ్ నెం.345/2026లో బీఎన్ఎస్‌లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 16న మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఫిర్యాదుదారురాలు స్వప్న బేగంబజార్ ఛత్రి వద్ద ఉన్న తన దుకాణంలో ఉండగా, మట్టి బస్తాల మార్పిడి విషయంలో ఉమేష్ తోష్నివాల్, అతనితో ఉన్న మరికొందరు తనపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు.అనంతరం బాధితురాలు గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సమయంలో ఉమేష్ భార్యలు ఉమ, కవిత, కుమార్తె ఏక్తా, మరికొందరు దుకాణంలోకి అక్రమంగా ప్రవేశించి ఆస్తిని ధ్వంసం చేయడంతో పాటు సుమారు రూ.70 వేల విలువైన సామగ్రిని తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనలో ఫిర్యాదుదారురాలి తల్లి సత్యవతి (65), కూలీ శశికళ (50), మరో కూలీ నందుపై కూడా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. సత్యవతి కుడి మణికట్టుకు గాయమైందని, పదునైన చెక్కకర్రతో దాడికి ప్రయత్నించడంతో పాటు ఆమె కుటుంబ సభ్యులను ప్రాణభయంతో బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### నలుగురు అరెస్ట్

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు తమ దుకాణంలో ఉన్నారన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ఉమేష్ కుమార్ తోష్నివాల్ (ఏ1), ఏక్తా తోష్నివాల్ (ఏ2), ఉమ తోష్నివాల్ (ఏ3), కవిత తోష్నివాల్ (ఏ4)లను అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబర్ 17న మధ్యాహ్నం 1.30 గంటలకు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో రాజేష్ (ఏ5), ప్రతీక్ (ఏ6), హరీష్ తదితరులు (ఏ7) పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు.

### గతంలోనూ నిరోధక చర్యలు

అరెస్టయిన వారిలో ఏ1, ఏ2లకు గతంలోనూ క్రిమినల్ కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో వారిపై నిరోధక చర్యలు (బౌండ్ ఓవర్) తీసుకున్నప్పటికీ, ప్రస్తుత ఘటనలో మళ్లీ నేరానికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో చట్టప్రకారం తదుపరి నిరోధక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, ఆధారాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని గోషామహల్ పోలీసులు తెలిపారు.

### వివాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలి

దుకాణాలు, ఆస్తులు, వ్యాపార వ్యవహారాలు లేదా వ్యక్తిగత విషయాలకు సంబంధించిన వివాదాలను శాంతియుతంగా, చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, ఇతరులను బెదిరించడం, దాడులకు పాల్పడటం, ఆస్తులను ధ్వంసం చేయడం లేదా చట్టపరమైన అధికారం లేకుండా ఇతరుల ప్రాంగణాల్లోకి ప్రవేశించడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

# ట్రస్మా గ్రేటర్ కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం,

గురు సన్మాన్ పురస్కార్ అవార్డు అందచేసిన బిఆర్ ఎస్ఎల్పి విప్ ఎమ్మెల్యే వివేకానంద్,





**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 18( పీపుల్స్ న్యూస్)** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రస్మా గ్రేటర్ కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్ పద్మావతి కన్వెన్షన్ లో నిర్వహించిన గురు సన్మాన్ పురస్కార్ 2026 కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని 75 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 150 మంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయురాలను శాలువాతో సత్కరించి మెమోంటోలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుతూ, క్రమశిక్షణతో కూడిన బంగారు భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలా కృషి అభినందనీయమని, శిష్యుడి విజయమే గురువుకు అతిపెద్ద గౌరవమని, ఉత్తమ ఉపాధ్యాయ, ఉపాధ్యాయునీయులగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులపై విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దే బాధ్యత నేటి నుండి రెట్టింపు అయిందన్నారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షులు కె. రామేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు గౌడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి గిరిబాబు , అనిల్, కోల వెంకటేష్, టీఆర్ఎస్ఎంఏ జిల్లా ఉపాధ్యక్షులు కైతి శ్రీనివాసరెడ్డి, గడ్డమీది బాలరాజ్, భూపతి రెడ్డి, సిహెచ్. నరసింహులు గౌడ్, ఆంజనేయులు, మహేందర్ రెడ్డి, శ్యామ్ ప్రసాద్ వివిధ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్ , పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, పలువురు నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన

**560 దరఖాస్తులు.. ఇప్పటివరకు 86 మందికి ఫీల్డ్ వెరిఫికేషన్**



**బెజ్జూర్, సెప్టెంబర్ 18** చేయూత పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన మండలంలో కొనసాగుతోంది. మొత్తం 560 దరఖాస్తులు రాగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటివరకు 86 దరఖాస్తులకు సంబంధించి ఫీల్డ్ వెరిఫికేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్, ఎంఈవో సునీత ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతోంది. శుక్రవారం లంబాడిగూడ, రెబ్బెన గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

కార్యక్రమంలో సర్పంచ్ కవిత, ఉప సర్పంచ్ బిక్షపతి నాయక్, కార్యదర్శి విఘ్నేష్, గ్రామస్తులు భూక్యా సంతోష్ నాయక్, ముడిమడుగుల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లు మనవి.. పదవులు ఉత్తమ్ దంపతులకా?

**కాంట్రాక్టులు బంధువులు, స్నేహితులకేనా?: సపావత్ సుమన్**

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్**



**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 18:**
హుజూర్‌నగర్, కోదాడ ప్రజలు ఏళ్లుగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులను ఆదరిస్తూ పదవులు కట్టబెడుతుంటే.. ఈ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మాత్రం నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించడం లేదని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సపావత్ సుమన్ ఆరోపించారు.నియోజకవర్గాల్లో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెబుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కాంట్రాక్టుల్లో అవకాశాలు ఇవ్వడం లేదని సుమన్ ఆరోపించారు. కాంట్రాక్టులను బంధువులు, స్నేహితులు, హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన వారికే కేటాయిస్తున్నారని విమర్శించారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎవరెవరికి, ఎన్ని కాంట్రాక్టులు ఇచ్చారో పూర్తి లెక్కలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "ఓట్లు మనవి.. అధికారం, కాంట్రాక్టులు మాత్రం మీవా?" అని ప్రశ్నించారు.ఇకనైనా హుజూర్‌నగర్, కోదాడ ప్రాంత ప్రజలకు ప్రాధాన్యం ఇచ్చి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పించాలని సుమన్ డిమాండ్ చేశారు.

# దేవునిపల్లిలో గణనాథుడికి మహిళల భక్తి నీరాజనం!

**ఐదో రోజు వైభవంగా సామూహిక కుంకుమార్చన**

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. గణనాథుడి నామస్మరణతో మార్మోగిన దేవునిపల్లి**




**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18**
ఎల్లారెడ్డి పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మహా వినాయకుడి సన్నిధిలో ఐదో రోజు శుక్రవారం పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన చేశారు. పూజా కార్యక్రమాలతో మండపం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా.. గణనాథుడి నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. మహిళలంతా భక్తి భావంతో పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఐదో రోజు సామూహిక కుంకుమార్చనకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో దేవునిపల్లిలో భక్తి సందడి నెలకొంది.

# పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణతో రూ.90 కోట్లు ఆదా

- **376 మంది సిబ్బంది తిరిగి విధుల్లోకి.. 103 వాహనాలు అందుబాటులోకి**
- **అక్టోబరులో దక్షిణాది డీజీపీల సదస్సు.. రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్'**
- **డీజీపీ సీవీ ఆనంద్ సమీక్ష**





**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్ )**
తెలంగాణ పోలీసుశాఖలో చేపట్టిన సిబ్బంది పునర్వ్యవస్థీకరణ, వనరుల హేతుబద్ధీకరణతో ప్రభుత్వానికి సుమారు రూ.90 కోట్ల ఆదా జరిగిందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశంలో మానవ వనరుల ఆడిట్, పునర్వ్యవస్థీకరణపై సమీక్షించారు. వివిధ పదవీ విరమణ చేసిన ఉద్యోగుల వద్ద విధులు నిర్వహిస్తున్న 376 మంది పోలీసు సిబ్బందిని తిరిగి అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 20 బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు, 7 ఫార్చ్యూనర్లు, 18 ఇన్నోవా క్రిస్టాలు, 58 ఇతర వాహనాలు తిరిగి వినియోగంలోకి వచ్చినట్లు తెలిపారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లోని 573 మందికి చెల్లిస్తున్న 60 శాతం అదనపు చెల్లింపులను ఉపసంహరించడంతో మరో రూ.28.16 కోట్ల మేర ఆదా జరిగిందన్నారు.

**అక్టోబరులో దక్షిణాది డీజీపీల సదస్సు.**
దక్షిణాది రాష్ట్రాల డీజీపీల ప్రాంతీయ సదస్సుకు అక్టోబరులో



తెలంగాణ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వామపక్ష తీవ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, తీర ప్రాంత భద్రత తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్'.**
పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమంపై దృష్టి సారిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు డీజీపీ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు మధుమేహం, థైరాయిడ్, పోషకాహారం, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

**పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం.**
అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్‌లు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, బాలల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీజీపీ సూచించారు.సమావేశంలో ఐజీ, డీఐజీ స్థాయి పోస్టులు, డీఎస్పీల పదోన్నతులు, హోంగార్డుల కొరత, పోలీసు నియామక ప్రక్రియ, పరిపాలన, బడ్జెట్, సంక్షేమ అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు.

# ఒకే కెమెరాతో పలు ఉల్లంఘనలకు చెక్

- **ఔటర్ రింగ్‌రోడ్డుపై అధునాతన ట్రాఫిక్ వ్యవస్థలపై సీపీ రమేష్ సమీక్ష**
- **రోడ్డు భద్రతకు సాంకేతికత దన్ను**









**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టేందుకు సైబరాబాద్ పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ఇందులో భాగంగా ఒకే కెమెరాతో పలు రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించే మల్టీ వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్ పనితీరును సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ శుక్రవారం సమీక్షించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన సీపీ.. ౹ా==పై రియల్‌టైమ్ ట్రాఫిక్ పర్యవేక్షణ, ఆటోమేటెడ్ ఉల్లంఘనల గుర్తింపు, రోడ్డు భద్రతకు సంబంధించిన సాంకేతిక ఏర్పాట్లను పరిశీలించారు. వీడియో అనలిటిక్స్ ద్వారా ఒకే కెమెరాతో పలు రకాల ఉల్లంఘనలను గుర్తించే విధానాన్ని అధికారులు సీపీకి వివరించారు.౹ా==పై ట్రాఫిక్ క్రమశిక్షణ పెంపు, ప్రమాదాల నివారణ, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించడంపై అధికారులతో సీపీ చర్చించారు. సైబరాబాద్ పోలీసులు, ౹+జూ సమన్వయంతో రోడ్డు భద్రతకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ×=దీ సీఈఓ డా. సతీందర్ సింగ్ రాణా, ప్రాజెక్ట్ హెడ్ కల్నల్ గిరీశ్వర్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బిస్వజిత్ సింగ్, సీనియర్ జీఎం చాంద్ బాషా, టోల్ జీఎం మూర్తి, రాజూజ సీఈఓ నవీద్, ట్రయోస్ బిజినెస్ హెడ్‌తో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి

**- ప్రకాష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దర్గా కరుణాకర్**

**-- శివభక్త భజన మండలి అధ్యక్షుడు కె. సురేష్ ఆధ్వర్యంలో**

**బాలానగర్ సెప్టెంబర్ 19 ( పీపుల్స్ న్యూస్)**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ప్రకాష్ నగర్ డివిజన్ పరిధిలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రకాష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దర్గా కరుణాకర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.



ప్రకాష్‌నగర్ డివిజన్‌లోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ వద్ద, ఎరుకల బస్తీ చౌరస్తాలో శివభక్త భజన మండలి అధ్యక్షుడు కె. సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దర్గా కరుణాకర్ సందర్శించారు. మండపంలో కొలువుదీరిన గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం మండపాల నిర్వాహకులు, భక్తులతో దర్గా కరుణాకర్ ఆత్మీయంగా ముచ్చటించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని కోరారు. గణనాథుని కృపతో ప్రజలందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దర్గా కరుణాకర్ ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యత, భక్తిభావం పెంపొందించేలా కొనసాగాలని పేర్కొన్నారు.

ఈ పూజా కార్యక్రమంలో శివభక్త భజన మండలి అధ్యక్షుడు కె. సురేష్, కొండ కిరణ్, చిన్న, శ్యామ్, నాగరాజు, మహేష్, కిషోర్, భరత్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు--పోలీసుల మధ్య వారధిగా 'సేతు'





మెహదీపట్నం పీఎస్‌లో పైలట్ ప్రాజెక్టుగా స్మార్ట్ ఏఐ కియోస్క్ ప్రారంభం





**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 18 (పీపుల్స్ న్యూస్)** ప్రజలు తమ సమస్యలను పోలీసులకు సులభంగా తెలియజేసేలా హైదరాబాద్ నగర పోలీస్ విభాగం సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పనిచేసే స్మార్ట్ కియోస్క్ లి'సేతు'లిను మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేసిన 'సేతు' ద్వారా ఫిర్యాదుదారులు తమకు తెలిసిన భాషలోనే సమస్యను వివరించే అవకాశం ఉంటుంది. ఏఐ సాంకేతికతతో ఫిర్యాదుదారుడి వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, ఫిర్యాదు స్వీకరించిన అనంతరం డిజిటల్ రసీదును అందజేస్తుంది. తదుపరి ప్రక్రియపై కూడా ఫిర్యాదుదారుడికి స్పష్టమైన సమాచారం అందుతుంది. నమోదైన ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక డిజిటల్ ట్రాకింగ్ సదుపాయం ఉండటంతో సమస్య పరిష్కారం వరకు దాని పురోగతిని పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులు సైతం ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను సమీక్షించవచ్చు. దీంతో పోలీస్ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఫిర్యాదుల నమోదు ప్రక్రియ వేగవంతం కావడంతో పోలీస్ స్టేషన్ సిబ్బంది సమయం కూడా ఆదా అవుతుందని, తద్వారా నేర నియంత్రణ, దర్యాప్తుపై మరింత దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే పోలీసింగ్ వ్యవస్థకు ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు సమస్యతో వచ్చే ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన సేవలు అందించాలన్నదే తమ విధానమని తెలిపారు. ప్రజలకు, పోలీసు వ్యవస్థకు మధ్య నమ్మకాన్ని పెంచే వారధిగా 'సేతు' పనిచేస్తుందని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించి పౌర సేవలను వేగవంతం, పారదర్శకంగా చేయడమే ఈ ప్రయోగం ఉద్దేశమన్నారు. మెహదీపట్నం పోలీస్ స్టేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన 'సేతు' పనితీరును పరిశీలించి, ఫలితాల ఆధారంగా దశలవారీగా నగరంలోని ఇతర పోలీస్ స్టేషన్లకు కూడా విస్తరించనున్నట్లు సీపీ వెల్లడించారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ సూచనలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (శాంతి భద్రతలు) తఫ్సీర్ ఇక్బాల్, అవినాష్ కుమార్, గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి, డెవలపర్ అమిత్ సింగ్, అదనపు డీసీపీ కృష్ణ గౌడ్, ఏసీపీ శ్రీనివాస్, ఎస్‌హెచ్ఓ మల్లేశ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# సిఎంపై సభా హక్కుల నోటీస్

**- స్పీకర్ కు అందజేసిన బిఆర్ఎస్**





**, హైదరాబాద్ బ్యూరో**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సభా హక్కుల నోటీసు అందజేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసిన బి ఆర్ ఎస్ శాసన సభా పక్ష నేతలు గంగుల కమలాకర్, పద్మారావు గౌడ్ ఈ నోటీసును అందజేశారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు సంబంధించిన భూముల విషయంలో అసెంబ్లీలో తప్పుడు సమాచారం ఇచ్చి, సభను తప్పుదోవ పట్టించారని బి ఆర్ ఎస్ నేతలు పేర్కొన్నారు . అందుకే స్పీకర్ ను కలసి సభా హక్కుల నోటీసు ఇచ్చామని వారు తెలిపారు.

# కాంగ్రెస్ ద్వంద్వ నీతిని బట్టబయలు చేసిన హైకోర్టు తీర్పు: మాజీ మంత్రి హరీశ్ రావు

**- పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ శ్రీరంగ నీతులే.**
**- ఫిరాయింపుదారులకు రక్షణ కల్పించే ప్రయత్నాలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు.**
**- రాజ్యాంగం మీద చిత్తశుద్ధి ఉంటే.. ఫిరాయింపు ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలి.**



**, హైదరాబాద్ బ్యూరో :**
దానం నాగేందర్ అనర్హత వేటు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు.. రాజ్యాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ద్వంద్వ నీతిని బట్టబయలు చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని నిలదీస్తూ ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ లోకి ఫిరాయించడమే కాకుండా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా కూడా పోటీ చేశారు. ప్రజల తీర్పును, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన స్పీకర్ వ్యవస్థ.. అందుకు విరుద్ధంగా దానం నాగేందర్ కు రక్షణ కవచంగా నిలవడం దురదృష్టకరం. ఈ వ్యవహారంలో స్పీకర్ తీరుపై హైకోర్టు తీర్పు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. దేశమంతా తిరిగి తానేదో రాజ్యాంగాన్ని రక్షించే ఛాంపియన్‌ని అని చెప్పుకునే రాహుల్ గాంధీ కపట నాటకాలు ఈ ఘటనతో బట్టబయలయ్యాయి. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి ఫిరాయిస్తే ఆటోమేటిక్ గా అనర్హత వేటు పడేలా 10వ షెడ్యూల్ ను సవరిస్తామని కాంగ్రెస్ తన 2024 ఎన్నికల మేనిఫెస్టోలో గొప్పలు చెప్పింది. మరి అదే పార్టీ ఫిరాయింపులు తెలంగాణ కాంగ్రెస్ లో జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారు? మీ నిబద్ధత ఎక్కడికి పోయింది? హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో స్పీకర్ కనీసం ఇప్పుడైనా స్పందించాలి. రాజ్యాంగం, చట్ట ప్రకారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయించిన ఇతర ఎమ్మెల్యేలందరిపై ఉన్న అనర్హత పిటిషన్ల మీద తక్షణమే చర్యలు తీసుకోవాలి. రాహుల్ గాంధీకి నిజంగా రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే.. పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, మళ్లీ ప్రజల తీర్పు కోరేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వాలి. రాజ్యాంగం పట్ల మీకున్న నిబద్ధత నిజమైనదా? లేక మీ రాజకీయ అవసరాలకు, సౌలభ్యానికి తగ్గట్టు ఎప్పటికప్పుడు మారుతుందా? అనేదానిపై కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి అని హరీష్ రావు పేర్కొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా భూములపై వచ్చిన ఆరోపణలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి

**--:కేసీఆర్ మౌనం అనుమానాలకు తావిస్తోంది: కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్**

**బాలానగర్ సెప్టెంబర్ 19 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములు, భూవ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై కేసీఆర్ వాస్తవాలతో సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సెప్టెంబర్ 16న 22-ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎర్రవల్లి ప్రాంతంలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూములపై విచారణకు ఆదేశించారు. సుమారు 700 ఎకరాల భూముల విషయంలో ప్రభుత్వ భూమి ఎంత ఉందనే అంశాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు వార్తా సంస్థలు నివేదించాయి. ఈ నేపథ్యంలో మదన్ మోహన్ మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన భూములపై ముఖ్యమంత్రి అసెంబ్లీ వేదికగా ప్రశ్నలు లేవనెత్తినప్పుడు, వాటికి సంబంధించి వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ఉందన్నారు.

**-- ఆరోపణలు అవాస్తవాలైతే ఆధారాలతో ఖండించాలి.....**

ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు వాస్తవం కాదని కేసీఆర్ భావిస్తే, వాటిని బహిరంగంగా ఖండించాలని మదన్ మోహన్ కోరారు. భూముల విషయంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని భావిస్తే ప్రభుత్వ రికార్డులు, ఎన్నికల అఫిడవిట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు తదితర ఆధారాలను ప్రజల ముందుంచి వాస్తవాలను స్పష్టం చేయాలని అన్నారు. "కేసీఆర్ కుటుంబంపై వచ్చిన ఆరోపణలు అవాస్తవాలైతే ఆధారాలతో ఖండించాలి. మౌనం వహించడం ద్వారా ప్రజల్లో అనుమానాలకు అవకాశం ఇవ్వకూడదు" అని మదన్ మోహన్ పేర్కొన్నారు.



**22-ఏ భూములపై విచారణ అవసరం**

రాష్ట్రంలో 22-ఏ నిషేధిత జాబితాలోకి చేరిన భూములపై కూడా ప్రభుత్వం విచారణ చేపడుతున్న నేపథ్యంలో నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. నిషేధిత జాబితాలో నిజమైన ప్రైవేటు భూములు చేరినట్లయితే వాటి సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రభుత్వ, అసైన్డ్, వివాదాస్పద భూముల విషయంలో చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

22-ఏ భూముల సమస్యపై ప్రభుత్వం సర్వేలు, పరిశీలనలు చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. నిషేధిత జాబితాలో ఉన్న నిజమైన భూముల హక్కుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి గతంలోనూ ప్రకటించారు.

**-- ధరణి, భూ రికార్డులపైనా స్పష్టత ఇవ్వాలి..........**

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల నిర్వహణ, ధరణి వ్యవస్థ, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, వివాదాస్పద భూములకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు పూర్తి వివరాలుతెలియాల్సినఅవసరంఉందని మదన్ మోహన్ అన్నారు. భూముల విషయంలో ఎవరి హయాంలో తప్పు జరిగినా విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు సమాధానం చెప్పడంతో పాటు, ప్రభుత్వం కూడా నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు ఖండిస్తూ ప్రతిగా రేవంత్‌రెడ్డి కుటుంబ భూములపై కూడా ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

**-- వాస్తవాలు ప్రజలకు తెలియాలి"**

"తెలంగాణ ప్రజలకు భూముల వ్యవహారంలో అసలు నిజాలు తెలుసుకునే హక్కు ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు సమాధానం చెప్పాలి. ప్రభుత్వం సమగ్ర విచారణ ద్వారా వాస్తవాలను తేల్చాలి. ఎవరు తప్పు చేసినా చట్టం ముందు సమానమే" అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్ స్పష్టం చేశారు. గమనిక: పై వార్తలో కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములపై ఉన్న అంశాలను ఆరోపణలు/విచారణ అంశాలుగానే పేర్కొంటున్నాం. అధికారిక విచారణ నివేదిక లేదా న్యాయపరమైన తుది నిర్ణయం వెలువడే వరకు వాటిని నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించరాదు.

# ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ స్టీల్ బ్రిడ్జిపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

**- ప్రియురాలే కారణమని సూసైడ్ నోట్ మనోజ్**





**హైదరాబాద్, హైదరాబాద్ బ్యూరో సెప్టెంబర్ 18 :**" నా చావుకి రీజన్ నా అప్పులు కాదు ...నేను లవ్ చేసిన అమ్మాయి. ఆమె పాస్ట్ ఏమున్నా ...అన్ని నేనే అనుకుని లవ్ చేశా. ప్రతిరోజు ఒక పాపాల చూసుకున్న. కానీ మా అమ్మానాన్నలను కూడా చనిపోవాలని అంటోంది. లవ్ లో ఉన్నప్పుడు తిట్టుకుటాం కానీ చనిపో చూస్తా వీడియో కాల్ చెయ్ అని అంటే ...నా మనసు ఆగలేదు. ఐయామ్ సారీ ...నాకు అప్పులు ఇచ్చిన వాళ్ళు ఫ్రెండ్స్ అండ్ ఫామిలీ. ఆమె కూడా ఇచ్చింది కానీ ప్రతి నెల నా శాలరీ నుంచి కడుతున్న. కానీ నా జాబ్ పోయేలా చేసింది. ఇప్పుడు ఆ జాబ్ లేకపోతే నాకు లైఫ్ లేదు. నా అప్పులు కట్టాలి అంటే జాబ్ కావాలి" అని సూసైడ్ నోట్ లో పేర్కొన్నాడు మనోజ్ కుమార్ అనే 29 ఏళ్ళ యువకుడు. ఆర్టీసీ స్టీల్ బ్రిడ్జ్ మీద ఒక యువకుడు కూడా తన బైక్ పార్క్ చేసి బ్రిడ్జ్ పైన కాళ్ళకు ఉన్న షూస్ తీసి బైక్ దగ్గరే వదిలేశాడు. బ్రిడ్జ్ మీదకు ఎక్కిన ఆ యువకుడు కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కింద రోడ్డు మీద పడిపోవడంతో రక్తపు మడుగులో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్క క్షణంలో ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటన చిక్కడ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఈ సంఘటనకు సంబధించిన వివరాలు కింది విధంగా ఉన్నాయి. మృతుడిని ముషీరాబాద్ పరిధిలోని పార్సిగుట్టకు చెందిన మనోజ్ కుమార్ (29)గా గుర్తించారు. శివం రోడ్డులోని అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ లో మనోజ్ పని చేస్తున్నాడు. ప్రేమించిన అమ్మాయి వాళ్ళ గత కొద్దీ రోజుల ముందు ఆయన ఉద్యోగం పోయింది. ప్రేమించిన అమ్మాయి మోసం చెయ్యడం, ఉద్యోగం లేకపోవడంతో మానసికంగా క్రుంగిపోయిన మనోజ్ ఆత్మ హత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# గణేష్ మండపాలను సందర్శించిన సైబరాబాద్ సీపీ

**- భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచన**





**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
గణేష్ ఉత్సవాల నేపథ్యంలో గుండ్లపోచంపల్లి పరిధిలోని అపర్ణ తులిప్, మ్యారిగోల్డ్, ఎల్లోబెల్స్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి సందర్శించారు. మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీపీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్ 112ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఎస్ హెచ్ఓ విజయవర్ధన్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మోత్కులగూడలో బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ధ్వంసం

**●గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు**

**●దుండగుల చర్యపై బీఆర్ఎస్ నాయకుల ఆవేదన.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నందిగామ సెప్టెంబర్ 18):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని మోత్కులగూడ గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం (17-09-2026) అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో మోత్కులగూడ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయని వారు తెలిపారు. 21-08-2023న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని గ్రామంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



అయితే మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని వారు అన్నారు. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి దర్యాప్తు చేపట్టి శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

**●మియాపూర్‌లో 14 ఎక్టసీ మాత్రలు స్వాధీనం.. ఒకరి అరెస్ట్**

**●గోవా--ముంబై--హైదరాబాద్ డ్రగ్ లింకులపై దర్యాప్తు ముమ్మరం**

**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 18 (పీపుల్స్ న్యూస్)** అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్‌పై తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా మియాపూర్ పోలీసులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో ఓ అనుమానిత మాదకద్రవ్యాల విక్రేతను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 9 గ్రాముల బరువున్న 14 ఎక్టసీ మాత్రలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వ్యక్తిని నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన పోలా సురేష్ గోపీ (29)గా గుర్తించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎల్.బి. నగర్‌లో నివసిస్తున్న అతడు 2024 జూలైలో గోవాకు వెళ్లి అక్కడ అద్దె ఆస్తుల వ్యాపారం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలతో సంబంధం ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి, పరిచయస్తుల కోసం మాదకద్రవ్యాలను సేకరించి అధిక ధరలకు సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

### గోవా--ముంబై--హైదరాబాద్ మధ్య సంబంధాలు

దర్యాప్తు ప్రకారం గోవాకు చెందిన “బాబా” అనే వ్యక్తి నుంచి సురేష్ గోపీ మాదకద్రవ్యాలను సేకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం ముంబైకి చెందిన డానిష్ ఆలమ్ అన్సారీతో పరిచయం ఏర్పడినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఎక్టసీ మాత్రలు కావాలని సురేష్ గోపీని




సంప్రదించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వారి అభ్యర్థన మేరకు సెప్టెంబరు 16న ముంబై వెళ్లిన అతడు డానిష్ ఆలమ్ అన్సారీ నుంచి 29 ఎక్టసీ మాత్రలను రూ.22,500కు కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు.అందులో 15 మాత్రలను ముంబైలోనే “మున్నా” అనే గోవాకు చెందిన పరిచయస్తుడికి విక్రయించినట్లు సమాచారం. మిగిలిన 14 మాత్రలను తీసుకుని ముంబైలోని నెరుల్ నుంచి ప్రైవేట్ ప్రయాణ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. హైదరాబాద్‌లో వాటిని సరఫరా చేసేందుకు తీసుకువస్తున్న సమయంలో మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఈగల్ ఫోర్స్, మియాపూర్ పోలీసుల సంయుక్త బృందం అతడిని అదుపులోకి తీసుకుంది.

### సరఫరాదారుల కోసం గాలింపు

ఈ కేసులో ప్రస్తావనకు వచ్చిన గోవాకు చెందిన “బాబా”, ముంబైకి చెందిన డానిష్ ఆలమ్ అన్సారీ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి.స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ మాదకద్రవ్యాల సేకరణ, రవాణా, సరఫరా, విక్రయాలతో సంబంధం ఉన్న మరిన్ని వ్యక్తుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. గోవా--ముంబై--హైదరాబాద్ మధ్య ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మధ్యవర్తులు, వినియోగదారులు, రవాణా మార్గాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

### మాదకద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు

ఈ ఘటనపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 1342/2026గా మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం--1985లోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.స్వాధీనం చేసుకున్నవి: 14 ఎక్టసీ మాత్రలు, సుమారు 9 గ్రాములు, రెండు సెల్‌ఫోన్లు. అరెస్టు: పోలా సురేష్ గోపీ (29).పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపిన వారు: గోవాకు చెందిన “బాబా”, ముంబైకి చెందిన డానిష్ ఆలమ్ అన్సారీ.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈగల్ ఫోర్స్ సూచించింది. తక్షణ ఆర్థిక లాభాల కోసం యువత మాదకద్రవ్యాల రవాణాదారులు, మధ్యవర్తులుగా మారవద్దని హెచ్చరించింది. మాదకద్రవ్యాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా ఈగల్ ఫోర్స్‌కు తెలియజేయాలని కోరింది.

# ఆలేరు మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి - ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,

**- యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి ఆలయ ఆదాయంలో వాటా ఇవ్వాలి, ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలి**

**యాదగిరిగుట్ట సెప్టెంబర్ 18.**



ఆలేరు: ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. యాదగిరిగుట్టకు రోజుకు లక్ష మంది భక్తులు వస్తున్నారని, సేవలన్నీ మున్సిపాలిటీయే అందిస్తోందన్నారు. గతంలో పంచాయతీగా ఉన్నప్పుడు ఆలయ ఆదాయంలో 30% వాటా ఇచ్చేవారని, మున్సిపాలిటీ అయ్యాక ఆగిపోయిందని, తిరిగి వాటా కేటాయించాలని కోరారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో ఇళ్లు, షాపులు, భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని, సైదాపూర్ సర్వే నం.329/314 లో అర్హులకు పట్టాలు ఇవ్వాలని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల ఉపాధి కోల్పోయిన 200 మంది వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపి, బ్రిడ్జిని తొలగించాలని, దీనిపై గతంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇచ్చిన హామీని గుర్తుచేయగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఆలేరును రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు, ఇది ప్రజల చిరకాల వాంఛ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఆలేరు నియోజకవర్గం ముందంజలో ఉందని, పేదల సొంతింటి కల నెరవేరుతోందని తెలిపారు.

# సరూర్ నగర్ చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**- భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘాపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి సమీక్షమల్కాజిగిరి కమిషనరేట్,**











**క్రైమ్ బ్యూరో సెప్టెంబరు 18 (పీపుల్స్ న్యూస్)** గణేష్ నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి సరోరీర్‌నగర్ చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను కూడా ఆమె పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీస్ కమిషనర్ సుమతి మాట్లాడి నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, భద్రతా చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.నిమజ్జన ప్రాంతంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది అప్రమత్తతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం సజావుగా పూర్తయ్యేలా అన్ని విభాగాల



# మునగల కొండలరావు నగర్‌లో ఘనంగా గణనాథుడి పూజలు

**నాల్గవ రోజు విశేష పూజలు చేసిన సింగం, నూతనకంటి దంపతులు భక్తులకు అన్నదాన వితరణ**



**దేవరకొండ 18సెప్టెంబర్** పట్టణంలోని మునగల కొండలరావు నగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కాలనీవాసులు సింగం మాధవి--జ్ఞానేశ్వర్ మరియు నూతనగంటి పద్మ--రామలింగం దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక గణపతి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గణనాథుడికి ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.?ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు కేతావత్ హనుమాన్ నాయక్, కేతావత్ రాధాకృష్ణ--సరిత, సులోచన--గోవర్ధన్ రెడ్డి, అరుణ--సుధాకర్ రావు, పద్మ--శేఖర్ గౌడ్, పానుగంటి అనిత--వెంకటయ్య, నాగమణి--మహాలక్ష్మయ్య, కమల--లిమియా నాయక్, చెన్న సుజాత, రజిత--శీను నాయక్, సువర్ణ--రమేష్, కాశమ్మ--రాములు, కౌసల్య--మకట్లాల్, తార్య--వాలి, అలివేలు--వెంకటయ్య, రేవతి--శరత్, పద్మ--హరిలాలు తదితరులతో పాటు ఇతర కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు.



# నోటీసులతో అధికారులు కవర్. కవర్ చుట్టి యజమాని అక్రమ నిర్మాణం.

●ఎవరైనా వస్తే 'మేనేజ్ చేసుకోండి' అంటూ సలహాలా?

●అక్రమ నిర్మాణం ఆగదు.. అధికారులు అడ్డుకోరు. !

●అడ్డదారుల్లో టౌన్ ప్లాన్ అధికారులు.!

●ప్రభుత్వ ఆదాయానికి గండి..!





**జూబ్లీహిల్స్ : సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
అక్రమ నిర్మాణాలను అడ్డుకోవలసిన అధికారులే... వారికి అండ గా నిలుస్తూ అందినంత దోచుకుంటున్నట్లు ఆరోపణ లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులుగా వారికి వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ తమకేం సరిపోవు అన్నట్టు.. అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. బోరబండ సర్కిల్, యూసఫ్ గూడా సర్కిల్ ప్రాంతాలలో నిర్మాణాలు దగ్గర అనేక చిన్న, పెద్ద ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం తమకేం పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. రహమత్ నగర్ పవిత్ర నర్సింగ్ హోమ్ యజమాని చేస్తున్న అక్రమ నిర్మాణమే టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్వాహనికి ఓ నిదర్శనం.


www.peoplesnews.in
పీపుల్స్ న్యూస్ దినపత్రిక

అక్రమ నిర్మాణంలో ఆసుపత్రి..!

రహమత్ నగర్ 100 గజాల్లో ఐదు అంతస్తులు.

విరుద్ధంగా జరుగుతున్నట్లు గుర్తించి హెచ్చరికలు జారీ చేసి, పనులను నిలిపివేసి ఉంటే ఇంత పెద్ద భవనం నిర్మాణం జరిగేదా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఐదు అంతస్తులు నిర్మాణమయ్యే వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా.. నిర్మాణం దాదాపు పూర్తయ్యాక నోటీసులు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీస్తున్నారు.అక్రమ నిర్మాణాల కారణంగా ఇటీవల శ్రీ కృష్ణా నగర్లో ప్రమాదం జరిగినప్పటికీ అధికారులు ముందస్తుగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజల ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్న సమయంలోనే కఠిన చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

నోటీసులకు నోట్ల కట్టలు అడ్డు.
ప్రభుత్వ ఉద్యోగులుగా వేతనాలు తీసుకుంటున్నప్పటికీ అక్రమ సంపాదన కోసం అధికారులు వెంపర్లాడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వద్ద అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై కూడా అధికారులు మౌనం వీడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అక్రమ నిర్మాణాలకు చర్యలు ఎందుకు తీసుకోరని నిలదీస్తున్నారు.కేవలం నోటీసులు జారీ చేసి ఫైళ్లను మూసివేయడం కాకుండా.. అక్రమ నిర్మాణాలపై వాస్తవంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారో అధికారులు బహిరంగంగా వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణం ప్రారంభమైనప్పుడే అడ్డుకోలేని వ్యవస్థ.. ఐదు అంతస్తులు పూర్తయ్యాక నోటీసులు ఇవ్వడం వెనుక నిర్మాణదారుడికి ప్రత్యక్షంగా సహకరించినట్టేనని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి కొనసాగుతున్న పనులను నిలిపివేయడంతో పాటు అక్రమ నిర్మాణం గుర్తించిన తర్వాత తీసుకోవలసిన చర్యలను అలస్యం చేయకుండా కఠినంగా వ్యవహరించడం వలన భవిష్యత్తులోఅక్రమ నిర్మాణాలు తగ్గుతాయని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

●జీరో పర్మిషన్‌తో ఐదు అంతస్తులా..?

●15 అడుగుల రోడ్డు 100 గజాల్లో భారీ నిర్మాణం..

●ఐదు అంతస్తులు నిర్మాణమయ్యే వరకు చోద్యం చూస్తారా..?

జూబ్లీహిల్స్: సెప్టెంబర్ 16 (పీపుల్స్ న్యూస్)
సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన వైద్యుడే అడ్డగోలుగా అక్రమ నిర్మాణం చేస్తున్నారు. సేవా రంగాన్ని వ్యాపారంగా మలుచుకుని టౌన్ ప్లానింగ్ నిబంధనలకు గాలికొదిలి నిటారుగా ఐదు అంతస్తుల అక్రమ నిర్మాణం చేస్తున్నారు.అధికారులకు తెలిసినప్పటికీ వారు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది మొత్తం రహమత్‌నగర్‌లోని పవిత్ర నర్సింగ్ హోమ్ యజమాని 100 గజాలలో చేస్తున్న నిర్మాణం. ఆసుపత్రికి ఎదురుగా ఓ 100 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండానే 5 అంతస్తుల నిర్మాణం చేస్తున్నారు. మరోవైపు కేవలం 15 అడుగుల రోడ్డులోనే ఐదు అంతస్తుల భవన నిర్మాణం చేయడం వలన భవిష్యత్తులో తీవ్ర ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. బస్తీలో అంబులెన్స్ వెళ్లేందుకు కూడా దారి ఉండే అవకాశం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు!
అక్రమ నిర్మాణాలపై అధికారులు తీసుకుంటున్న చర్యలు కేవలం నోటీసులకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం ప్రారంభమైన సమయంలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన అధికారులు.. ఐదు అంతస్తులు నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూసి ఒకట్రెండు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నిర్మాణం మొదటి దశలోనే నిబంధనలకు

peoplesnews.online | 17 Sep, 2026 | Page: 10 | Clip ID: C-910813
For more details, visit peoplesnews.online

ఎలాంటి అనుమతులు లేకుండానే ఐదు అంతస్తులు అక్రమ భవనం నిర్మించేంతవరకు అధికారులకు మాత్రం చోద్యం చూస్తున్నారే తప్ప దానిపై చర్యలు తీసుకునేందుకు ముందుకు రాలేదు. అసలే పదిహేను అడుగుల రోడ్డు దానికి తోడు ఆకాశాన్నంటే నిర్మాణం చేస్తే దానివలన వాహనాల పార్కింగ్ స్థానిక ప్రజలకు పెనుసవాలుగా మారే అవకాశం ఉంది.

**విమర్శలు రావడంతోనే హుటాహుటిన నోటీసులు!**
రహమత్ నగర్ పవిత్ర నర్సింగ్ హోమ్ యజమాని నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన తర్వాతే అధికారులు హుటాహుటిన నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. నిర్మాణం ప్రారంభ దశలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన అధికారులు.. నిర్మాణం ముందుకు సాగుతున్నంత వరకు పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విమర్శలు, మీడియా కథనాలు వెలుగులోకి రావడంతో నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, అక్రమ నిర్మాణదారుడికి అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. ఎవరైనా ప్రశ్నిస్తే 'మేనేజ్ చేసుకోండి' అన్నట్టుగా సలహాలు ఇస్తున్నారనే తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు గుర్తించినప్పుడు కేవలం నోటీసులతో సరిపెట్టకుండా, నిర్మాణ అనుమతులు, భవన నిబంధనల ఉల్లంఘన సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణం కొన సాగకుండా వెంటనే సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తప్పును కవర్ చేసుకున్నందుకు నోటీసులు ఇస్తే... నిర్మాణదారులు మాత్రం కవర్ కట్టుకొని అక్రమ నిర్మాణం కొనసాగిస్తున్నారు . ఇప్పటికైన అధికారులు వారి తప్పును తెలుసుకొని చర్యలు తీసుకోకపోతే అధికారులకు ప్రజలలో చులకన అవడం ఖాయమని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## ముడుపులు ఇస్తే సక్రమమా.. ఇవ్వకుంటే అక్రమమా?







**కమర్షియల్ షట్టర్ నిర్మాణంపై చర్యలు ఎప్పుడంటున్న స్థానికులు**

**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
గాజులరామారం సర్కిల్--57 పరిధిలో రోడా మేస్త్రి నగర్ లో అనుమతులు, నిర్మాణాల పర్యవేక్షణపై టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.ఇటీవల ఓ భవనంపై కమర్షియల్ షట్టర్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**సిఎంసి ఆదేశాల అమలు ఎక్కడ?**
సంబంధిత ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను గాజులరామారం సర్కిల్--57 టౌన్ ప్లానింగ్ అధికారులు అమలు చేస్తున్నారా లేదా అన్నదానిపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు ఉంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**కమిషన్ల ఆరోపణలపై విచారణ చేయాలి**
"టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులు లేదా కమిషన్లు ఇస్తే కమర్షియల్ భవనం నిర్మించుకోవచ్చా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు బహిరంగంగా వెల్లడికాలేదు. అవినీతి ఆరోపణలు నిజమైతే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారులు వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందా లేదా అన్న విషయాన్ని సంబంధిత అధికారులు స్పష్టం చేయడంతో పాటు, అనుమతులు మరియు నిర్మాణ పరిస్థితిపై పారదర్శకంగా వివరాలు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రామన్నపాలెంలో పోషణ మాసం కార్యక్రమం



**ఖమ్మం సెప్టెంబర్ 18** వేంసూరు మండల పరిధిలోని రామన్నపాలెం కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగాజలం ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ జుంజునూరి కృష్ణకుమారి వరప్రసాద్ వైయస్ సర్పంచ్ పుచ్చకాయల శంకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫుడ్ డెమోనిస్ట్రేషన్ చేసి తల్లులకు వివరించారు. అదేవిధంగా సర్పంచ్ జుంజునూరి కృష్ణకుమారి వరప్రసాద్, ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్ రెడ్డి సమక్షంలో పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ గంగాజలం ఏఎన్ఎం శ్రీలక్ష్మి అంగన్వాడీ టీచర్లు మంగమ్మ లలిత మరియు తల్లులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.రామన్నపాలెంలో పోషణ మాసం కార్యక్రమం

## భీమవరంలో పోషణ మాసం కార్యక్రమం



**ఖమ్మం సెప్టెంబర్ 18** వేంసూరు మండల పరిధిలోని భీమవరం గ్రామపంచాయతీలో భీమవరం వన్ అంగన్వాడి కేంద్రంలో సత్తుపల్లి సిడిపిఓ బి సత్యవతి, సర్పంచ్ వంట్ల రమేష్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగినటువంటి ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించారు. సిడిపిఓ సత్యవతి మాట్లాడుతూ మనిషి జీవించటానికి తీసుకోవలసినటువంటి ఆహారం పోషక విలువలు కోల్పోకుండా ఉండే విధానం గురించి మరియు గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు తీసుకోవలసిన ఆహారం గురించి వివరించారు. అనంతరం ఇద్దరు గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి వారికి తగు జాగ్రత్తలు సూచనలు చేశారు. ఆరుగురు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి పోషణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కమల, స్కూల్ హెచ్ఎం నాగమణి, ఏఎన్ఎం నసీమా మరియు అంగన్వాడీ టీచర్లు శాంత కుమారి, రాధాకుమారి, రజిని . గ్రామ పెద్దలు తల్లులు పాల్గొన్నారు.

## ఆదరణ సేవ ఫౌండేషన్ లో పుట్టినరోజు సందర్భంగా మంచాలు వితరణ



**మధిర సెప్టెంబర్ 18**
మధిర పట్టణం సుశీల డిగ్రీ కాలేజ్ రోడ్ లో ఆదరణ సేవా ఫౌండేషన్ లో బోనగిరి నారాయణరావు సతీమణి శ్రీమతి వనజ పుట్టినరోజు సందర్భంగా కుమారులు కోడళ్ళు సాయి కృష్ణ శ్రీమతి సౌజన్య - జయ కృష్ణ శ్రీమతి ప్రతిమ వృద్ధులకి మతిస్థిమితం లేని వారికి పండ్లు 4 మంచాలు వితరణ అందజేశారు.....ఈ సందర్భంగా ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి మంచాలను అందజేసిన నారాయణ రావు వనజ గార్లకి ప్రత్యేక ధన్యవాదాలు పుట్టినరోజు శుభాకాంక్షలు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని భగవంతుని కోరుకున్నారుమధిర రెస్క్యూ టీం ఆదరణ ఫౌండేషన్ 9963115303 నిస్సి

## ఎం ఆర్ పి ఎస్ మధిర మండల అధ్యక్షుడిగా వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ ఏకగ్రీవ ఎన్నిక.



**మధిర సెప్టెంబర్ 17**
ఎమ్మార్పీఎస్ మధిర మండల నూతన కమిటీ నిర్మాణంకి ముఖ్య అతిథిగా ఎం ఆర్ పి ఎస్ ఖమ్మం జిల్లా ఇంచర్జ్ కందికట్ల విజయ్ మాదిగ, మధిర నియోజకవర్గ ఇన్చార్జ్ కూరపాటి సునీల్ మాదిగ ఎం ఎస్ పి మాజీ జిల్లా అధ్యక్షులు తూటికశీటి అంజయ్య మాదిగ ఎం ఆర్ పి ఎస్ మధిర ఇంచార్జ్ పార్సపు ఏసుక మాదిగ ఆధ్వర్యంలో, మధిర మండలంలోని అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.ఏకగ్రీవంగా ఎన్నికైన మధిర మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ
మండల అధ్యక్షుడు: వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ
అధికార ప్రతినిధి: దోర్నాల ఆంజనేయులు మాదిగ
ప్రధాన కార్యదర్శి:దర్శి నాగభూషణం మాదిగ కార్యదర్శులు: పుట్టా రవికుమార్ మాదిగ, గుంట పుల్లారావు మాదిగ, చౌటుపల్లి రవీందర్ కుమార్ మాదిగఉపాధ్యక్షులు: కొరివి శేఖర్ మాదిగ, కామచి శ్రీనివాసరావు మాదిగకోశాధికారి:రాయవరపు రామకృష్ణ మాదిగ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కనకపుడి శ్రీను మాదిగ, రాయవరపు దాసు మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు ఎస్.కె రంజాన్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పల్లె పోగు స్వామి మాదిగ, ఎమ్మెస్ పి సీనియర్ నాయకులు ఎండి జమీర్, ఎస్కే దస్తగిరి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్ కు ఓ లెక్క

# పేదోడుకో లెక్క..?

**పేదల గుడిసెలు అయితే కూల్చివేత.**
**మాజీ కార్పొరేటర్ నిర్మాణం కనిపించలేదా?**









మాజీ కార్పొరేటర్ ప్రభుత్వ స్థలంలో కబ్జా చేసి అక్రమ భవనం నిర్మాణం

**కుత్బుల్లాపూర్: సెప్టెంబర్ 18 (పీపుల్స్ న్యూస్)**
కుత్బుల్లాపూర్ దేవేందర్‌నగర్ సర్వే నెంబర్ 329 లో అక్రమ నిర్మాణాల పేరుతో అధికారులు చేపట్టిన కూల్చివేతలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలంటే అన్ని వర్గాల నిర్మాణాలపై ఒకే విధమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ స్థలాలు, అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యతే అయినప్పటికీ.. పేదల గుడిసెలను గుర్తించి కూల్చివేసిన అధికారులకు, అదే ప్రాంతంలో మాజీ కార్పొరేటర్‌కు సంబంధించినట్లు స్థానికులు చెబుతున్న నిర్మాణాలు ఎందుకు కనిపించలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పేదవాడికి ఒక న్యాయం.. పెద్దవాడికి మరో న్యాయమా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణం ఎవరిదైనా చర్యలు ఒకే విధంగా ఉండాలని కోరుతున్నారు.ఇక అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయంలో కొందరు ప్రజాప్రతినిధులతో కుమ్మక్కయ్యారనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. మాజీ కార్పొరేటర్‌తో అధికారులు చేతులు కలిపినట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, మాజీ కార్పొరేటర్ వివరణ ఇవ్వాల్సి ఉంది.అక్రమ నిర్మాణాలపై నిజంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లయితే.. చిన్న గుడిసె నుంచి పెద్ద భవనం వరకు ఒకే కొలమానం ఎందుకు ఉండకూడదని స్థానికులు నిలదీస్తున్నారు.

**పేదోడు డబ్బులు ఇవ్వలేదు..**
"పేదోడు డబ్బులు ఇవ్వలేదనే కూల్చివేతలు.. పెద్దోడు అడిగినంత ఇస్తాడనే చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారా?" అంటూ స్థానికులు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.సర్వే నంబర్ 329లో ఇంత తతంగం నడుస్తున్నప్పటికీ ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు వెళ్లడం లేదని స్థానికులు నిలదీస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే అవి పేదవాడివైనా.. పలుకుబడి ఉన్నవారివైనా ఒకే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెబుతున్నారు.కూలీనాలీ చేసుకుని జీవించే పేదలు గుడిసెలు వేసుకుంటే వెంటనే అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చివేతలు చేపట్టడం.. మరోవైపు పెద్ద నిర్మాణాల విషయంలో మాత్రం అధికారులు మౌనం వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగడం ఆందోళన కలిగించే విషయమని స్థానికులు అంటున్నారు.చట్టం ముందు అందరూ సమానమే అయితే.. చర్యల్లో ఈ తేడా ఎందుకు?అక్రమ నిర్మాణం పేదవాడిదైనా, పెద్దవాడిదైనా ఒకే నిబంధన ఎందుకు అమలు చేయడం లేదు?సర్వే నంబర్ 329లో జరుగుతున్న నిర్మాణాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, అంతస్తులపై అంతస్తులు నిర్మించిన మాజీ కార్పొరేటర్ నిర్మాణం పరిచర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బీజేపీ టేక్మాల్ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కోయిలకొండ దుర్గాప్రసాద్ నియామకం

**మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ సెప్టెంబర్ 18**



భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా టేక్మాల్ మండల అధ్యక్షుడిగా కోయిలకొండ దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోణం విఠల్ ఆయనకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి, ఓబీసీ వర్గాల అభ్యున్నతికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నిరంతరం శ్రమించాలని కోణం విఠల్ పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన దుర్గాప్రసాద్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు కట్టబెట్టినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని ఆయన చెప్పారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు.

## ఫార్మసీల పై 'CCTV కన్ను.. ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందుల విక్రయం!

**-కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం --- నోటిఫికేషన్ విడుదల**

**హైదరాబాద్ 18 సెప్టెంబర్**



**సిసిటీవీ నిబంధనలు ఉ లక్ష్యాలు:**
– 3 నెలల రికార్డింగ్ భద్రత: ప్రతీ ఫార్మసీలో కస్టమర్లు, మందుల విక్రయాలు స్పష్టంగా కనిపించేలా జజుఎ కెమెరాలను అమర్చాలి. అంతేకాకుండా, ఆ రికార్డింగ్స్‌ను కనీసం 3 నెలల పాటూ భద్రపరచడం తప్పనిసరి.
– ప్రిస్క్రిప్షన్ వెరిఫికేషన్: డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే మందులు ఇస్తున్నారా లేదా అని డ్రగ్ ఇన్స్‌పెక్టర్లు, అధికారులు ఈ సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా తనిఖీ చేస్తారు.
– సిరప్‌ల దుర్వినియోగానికి చెక్: పెద్దలకు ఉద్దేశించిన శక్తివంతమైన దగ్గు సిరప్‌లు (Cough Syrups), ఇతర యాంటీబయోటిక్స్, అలవాటుగా మారే నిద్ర మాత్రలను పిల్లలకు ఇవ్వకుండా, అక్రమంగా విక్రయించకుండా అడ్డుకోవడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.
– నకిలీ విక్రయాలకు అడ్డుకట్ట: మత్తు పదార్థాలుగా ఉపయోగపడే మందులను షెడ్యూల్డ్ డ్రగ్స్ కింద విక్రయించకుండా పూర్తి స్థాయిలో పారదర్శకత తీసుకురానున్నారు.

## అక్టోబర్ 1 నుంచి జనన-మరణ నమోదు కొత్త నిబంధనలు



**హైదరాబాద్ 18 సెప్టెంబర్**
జనన, మరణ రికార్డులను కచ్చితంగా, పారదర్శకంగా..
సకాలంలో నమోదు లక్ష్యంగా కొత్త నిబంధనలు
2ఏళ్లకుపైగా ఆలస్యమైతే మేజిస్ట్రేట్ ఆదేశం తప్పనిసరి
ఆలస్య నమోదుకు ధృవీకరణ, రుసుము తప్పనిసరిఅక్టోబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా కొత్త నిబంధనలు

## ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం

**బోనకల్ సెప్టెంబర్ 18**



బోనకల్ మండల పరిధిలో ముష్టికుంట్ల గ్రామం నందు నిర్వహించిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) రైతు శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వ్యవసాయ ఆత్మ కమిటీ చైర్మన్(మధిర) శ్రీ. కర్నాటి రామ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధిర ౹ూ౹ూ సైంటిస్ట్ రుక్మిణి దేవి ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులకు వరి , చిల్లీ వెజిటబుల్ క్రాప్స్ లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు మరియు చీడపీడలు నివారణ మీద ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.ప్రస్తుత ఎల్ నినో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నీటి వినియోగం తక్కువగా ఉన్నటువంటి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని రైతులను కోరారు. అదే విధంగా సహాయ వ్యవసాయ సంచాలకులు (మధిర) ఇమ్మడి వాణిశ్రీ మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో ఎరువుల వాడకాన్ని నియంత్రించి, పంటకు అవసరమైన సిఫారసు మేరకు మాత్రమే వినియోగించడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చు అని తెలిపారు.అలాగే అపరాల సాగును ప్రోత్సహించాలని ఆమె కోరారు..సమగ్ర పోషక యాజమాన్యం లో రసాయన ఎరువులతో పాటు సేంద్రీయ ఎరువులు మరియు జీవన ఎరువులను సమతుల్యంగా వాడడం ద్వారా నేల సారం మరియు నేల ఆరోగ్యాన్ని మెరుగుపడుతుందని తెలిపారు. నేలలో సూక్ష్మజీవుల కార్యకలాపాలను మరియు పంట ఉత్పత్తి, నాణ్యతను పెంచుతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్ కుమార్, ఎంటోమోలాజిస్ట్ నాగస్వతి , ముష్టికుంట్ల సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు , ఆత్మ డైరెక్టర్ కందుల పాపారావు ,సొసైటీ చైర్మన్ బి వెంకటేశ్వర్లు , ఉప సర్పంచ్ సీతయ్యా , ౹ూజుౕూ ముష్టికుంట్ల, లక్ష్మీపురం క్లస్టర్స్ మరియు రైతులు పాల్గొన్నారు.

# చలో వరంగల్‌ను విజయవంతం చేయాలి

**- 27న బీసీ, ఎస్సీ, ఎస్టీ భారీ బహిరంగ సభ**
**- ములుగు నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని జేఏసీ నేతల పిలుపు**
**- 'ఎవరి జనాభా ఎంతో.. వారికి అంత వాటా కల్పించాలి'**
**- ములుగు జిల్లా చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్**



**ములుగు, సెప్టెంబర్ 18**
సామాజిక న్యాయం, రాజ్యాధికారం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉద్యమించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 27న హనుమకొండ హంటర్‌రోడ్డులోని డి కన్వెన్షన్‌లో నిర్వహించనున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జిల్లా చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ చంద మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి పొదిళ్ల సాయిబాబా, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మేకల సుమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 27న జరిగే బహిరంగ సభకు ములుగు జిల్లా నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. 'ఎవరి జనాభా ఎంతో.. వారికి అంత వాటా' దక్కేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారంలో తగిన భాగస్వామ్యం కోసం సిద్ధం కావాలని చంద మల్లయ్య కోరారు.కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జేరుపోతుల కరుణాకర్, మల్యాల మనోహర్, చిరంజీవి, ఎల్.అశోక్, దేవ, గొంగళ్ల కట్టయ్య, బొచ్చు సాంబయ్య, బాణాల కొమురయ్య, బాణాల ప్రభాకర్, గుల్లగట్టు సంజీవ్, బైకాని మోహన్, దామోదర్, మోడం మొగిలి గౌడ్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com